గాలివాన బీభత్సం

● నేలకొరిగిన వృక్షాలు ● పలుచోట్ల కూలిన విద్యుత్ స్తంభాలు ● టమోటా పంటకు నష్టం

కలకడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలకడ, బాలయ్యగారిపల్లె, బాటవారిపల్లె గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి గాలివాన దంచికొట్టింది. గాలివానకు భారీగా వృక్షాలు నేలకొరిగాయి. ఓ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు, పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలతో పాటు కలకడ దిన్నెమీదపల్లె 33 కేవీ విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కలకడ హౌసింగ్ కాలనీలో కరెంట్ తీగలు తెగిపడ్డాయి. అక్కడ ఇళ్ల నిర్మాణంలో ఉండడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ఎర్రయ్యగారిపల్లె, కలకడలో ఇళ్ల ముందు వేసిన రేకులు లేచిపోగా ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. బాలయ్యగారిపల్లె నల్లగుట్టపల్లెలో రైతు రెడ్డెప్ప పొలంలో మామిడి చెట్లు నేలకొరిగాయి. అదే గ్రామానికి చెందిన రైతు ఈశ్వరయ్య పొలంలో వేప వృక్షాలు టమోటా పంటపై పడి పాక్షికంగా దెబ్బతిన్నాయి. కలకడలో ఓ రైతు పొలంలో గట్లపై ఉన్న టేకు వృక్షాలు కిందపడ్డాయి. బాటవారిపల్లె పంచాయతీ కూచివారిపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్ భూమిపై టమోటా పంటకు అమర్చిన మల్చింగ్ పేపర్ ధ్వంసమైంది. కె.మాదిగపల్లె ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈ కారణంగా బాలయ్యగారిపల్లె పంచాయతీలో అన్ని గ్రామాలు, కేవీ పల్లె మండలంలోని కొన్ని గ్రామాలు, కలకడ, బాలయ్యగారిపల్లె, బాటవారిపల్లె గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కలకడ పట్టణంలో విద్యుత్ సరఫరాను శుక్రవారం మధ్యాహ్నానికే పునరుద్ధరించినట్లు ఏఈ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాగా 40.2 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసినట్లు ఇన్‌చార్జి ఏఎస్‌వో రెడ్డెప్పనాయుడు తెలిపారు.



కలకడలో నేలను తాకుతున్న విద్యుత్ తీగలు



నల్లగుట్టపల్లెలో నేలకొరిగిన మామిడిచెట్లు



నల్లగుట్టపల్లెలో టమోటా పంటపై పడిన వేపచెట్టు



కలకడ కాలనీలో ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం

బాహుదాలో వర్షపు నీరు

● 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

సుండుపల్లె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె, పింఛా ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురవడంతో బాహుదా నదిలో నీరు ప్రవహిస్తోంది. సుండుపల్లె మండల వ్యాప్తంగా 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాహుదా పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో బాహుదాలో వర్షపు నీరు ప్రవహిస్తోంది. చాలా రోజుల తర్వాత బాహుదాలో నీరు ప్రవహిస్తుండడంతో మండల ప్రజలు బాహుదా నది వద్దకు వెళ్లి తిలకిస్తున్నారు. ఈ నది ప్రవహించడం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బాహుదాలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

అదును దాటాక..
జిల్లా వ్యాప్తంగా వర్షాలు

● కేవీ పల్లెలో 110.2 మి.మీ.

● జిల్లా మొత్తం 1286.2 మిల్లీమీటర్ల వర్షపాతం



రాయచోటి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ దాటాక ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. గరిష్టంగా కేవీ పల్లె మండలంలో 110.2 మిల్లీమీటర్లు, కనిష్టంగా పుల్లంపేటలో 5.4 మిల్లీమీటర్లు, జిల్లా వ్యాప్తంగా 1286.2 మిల్లీమీటర్లు నమోదైంది. శుక్రవారం కురిసిన వర్షపాతం వివరాలను చూస్తే.. గాలివీడులో 34.4 మి.మీ., చిన్నమండెంలో 92, సంబేపల్లెలో 36.4, సుండుపల్లెలో 60.2, రాయచోటిలో 27.2, లక్కిరెడ్డిపల్లెలో 30, రామాపురంలో 33.4, వీరబల్లిలో 27.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. నందలూరులో 96.4, పెనగలూరులో 12.8, చిట్వేలిలో 24.8, రాజంపేటలో 69.8, మిల్లీమీటర్లులో, ఓబులవారిపల్లెలో 24, కోడూరులో 107.2, ములకలచెరువులో 42, తంబళ్లపల్లెలో 36.4, పెద్దమండ్యంలో 57.8, గుర్రంకొండలో 6.6, కలకడలో 40.2 మి.మీ. వర్షపాతం నమోదైంది., పీలేరులో 34.4, కలికిరిలో 72.2, వాల్మీకిపురంలో 38.4, కురబలకోటలో 10, పీటీఎంలో 37, బి.కొత్తకోటలో 55, మదనపల్లెలో 16.2, నిమ్మనపల్లెలో 41.4, రామసముద్రంలో 7.2 మిల్లీమీటర్లు, ఈనెల 4 నుంచి ఇప్పటి వరకు 2508.4.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాస్తవానికి ఈనెల సాధారణ వర్షపాతం 2993.4గా ఉంది. రైల్వేకోడూరు, గుర్రంకొండ, మదనపల్లె మండలాల్లో ఈనెల 4 నుంచి ప్రతి రోజూ వర్షం కురవడం విశేషం. ఈనెల 4 నుంచి కోడూరులో 131.2 మిల్లీ మీటర్లు కురిసింది.. ఇప్పటి వరకు జిల్లాలోని 30 మండలాల్లో కేవలం పది మండలాల్లో మాత్రమే సాధారణం కంటే ఎక్కువగా కురవగా మిగిలిన అన్ని మండలాల్లోనూ లోటు వర్షపాతమే నమోదైంది. జూన్ నుంచి సాధారణం కంటే 31 శాతం తక్కువగా జిల్లాలో వర్షపాతం నమోదైంది. కేవీ పల్లె మండలంలో మాత్రమే సాధారణం కంటే ఎక్కువగా కురవగా 9 మండలాల్లో సాధారణంగా నమోదైంది. 19 మండలాల్లో 20 శాతం నుంచి 59.9 శాతం తక్కువగా కురవగా.. రామసముద్రంలో 69 శాతం లోటుతో వర్షాలు పడ్డాయి.

రైతులకు ఏమాత్రం ఉపయోగమో?

ఈ ఏడాది ఖరీఫ్ సీజను ఆరంభం నుంచే వానదేవుడు జిల్లా రైతుల పట్ల చిన్నచూపు చూసినట్లు ఉంది. సీజన్ మొదలు కాకముందు మేలో కొంత మెరుగ్గానే.. వానలు పడ్డాయి. దీంతో ఈసారి ఖరీఫ్‌లో తమకు వానలతో ఇబ్బందులు ఉండవని రైతులు ఆశించారు. అయితే రైతుల ఆశలకు గండి కొడుతూ.. జూన్, జూలైలలో వానదేవుడు ముఖం చాటేశాడు. ఫలితంగా ఈసారి జిల్లాలో పంటల సాగు గణనీయంగా పడిపోయింది. వేరుశనగ సాధారణ సాగులో పది శాతం కూడా కాలేదు. ఇప్పటికే వేరుశనగ రైతులు వానలపై ఆశలు వదిలేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో గురు, శుక్రవారాల్లో జిల్లాలోని పలు మండలాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలోనే వానలు పడ్డాయి. ఈ వానలు రైతులకు ఏమాత్రం ఉపయోగపడతాయో చూడాల్సిందే.



ములకలచెరువు మార్కెట్ యార్డులో టమోటా బాక్సులపై కప్పిన పట్టలు

ఆగని వర్షం..

ములకలచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో వర్షం ఆగడం లేదు. శుక్రవారం సాయంత్రం నుంచి మళ్లీ వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. దీంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ములకలచెరువు మార్కెట్‌యార్డుకు టమోటాలు తీసుకొచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో టమోటాలు తడవకుండా పట్టలు కప్పాల్సి వచ్చింది. అలాగే మార్కెట్ యార్డు బురదమయమైంది. టమోటా వాహనాలు భారీగా రాకపోకలు సాగించడంతో రొచ్చుగా మారడంతో రైతులు అవస్థలు పడాల్సి వచ్చింది.


పంట పొలాల్లో..



బీన్స్ తోటలో నిలిచిన వర్షపునీరు

రామసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండల వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వరి మడులు సాగుకు ఉపయోగంగా ఉంటుందని రైతులు అంటున్నారు. నాలుగు రోజులుగా రోజూ తుంపర్ల వర్షం పడగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. పంటపొలాల్లో వర్షం నీరు నిలిచింది. టమోటా, కొత్తమీర, కాలిఫ్లవర్, బీన్స్ పంటలకు నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు. ఈ వానలు ఇలాగే కొనసాగితే చెరువులు, బావులు నిండి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రావమ్మా.. మహాలక్ష్మీ..



మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో పది లక్షల రూపాయల నోట్లతో ధనలక్ష్మీదేవి అలంకరణ

గాజుల అలంకరణ



మదనపల్లెలో కోర్టులో గంగమ్మకు వరలక్ష్మీవ్రతం సందర్భంగా ప్రత్యేకంగా గాజుల అలంకరణ

దళారుల దోబూచులాట..

● బొప్పాయి టన్ను ఒకచోట రూ.9 వేలు, మరోచోట రూ.8 వేలు ● చెక్‌పోస్టుల వద్ద కొనసాగుతున్న తనిఖీలు

రైల్వేకోడూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా దళారులు బొప్పాయి రైతులతో దోబూచులాడుతున్నారు. బొప్పాయి టన్ను రూ.9 వేలకు తగ్గకుండా కోతలు కోయాలని ఈనెల 1వ తేదీ కలెక్టర్ చామకూరి శ్రీధర్ దళారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను కూడా బేఖాతర్ చేయడంతో కలెక్టర్ కన్నెర్ర చేశారు. ఆయన ఆదేశాల మేరకు రాజంపేటకు సబ్ కలెక్టర్‌గా కొత్తగా వచ్చిన భావన రెండుసార్లు రైల్వేకోడూరుకు వచ్చి ఇటు బొప్పాయి రైతులు, దళారీలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. బొప్పాయి ధర ఒక కొలిక్కి వచ్చినప్పటికీ శుక్రవారం నియోజకవర్గంలో కొందరు దళారులు టన్ను రూ.9 వేలతో కోతలు కోయగా, మరికొందరు దళారులు టన్ను రూ.8 వేలతో కోతలు కోశారని రైతులు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. దళారులతో ఉద్యాన, రెవెన్యూ, మార్కెటింగ్ తదితర అధికారులు మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తున్నారు. కానీ కొన్ని చోట్ల రూ.8 వేలతోనే కోతలు సాగినట్లు తెలిసింది. రైల్వేకోడూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు ప్రాంతాల్లో ఉన్న బొప్పాయి తోటల వద్దకు అధికారులు వెళ్లి బొప్పాయి ధరపై క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేశారు. అలాగే చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచారు. స్థానిక వీఆర్‌వోలు, ఉద్యాన అసిస్టెంట్లు, మార్కెటింగ్ సిబ్బంది ప్రతి బొప్పాయి లారీని పరిశీలించారు. ఈ పరిశీలనలు శనివారం వరకు కొనసాగనున్నట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. టన్ను రూ.9 వేలకంటే తక్కువ చేస్తే మళ్లీ చర్యలు వేగంగా ఉంటాయని తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ హెచ్చరిస్తున్నారు. కొందరు దళారులు టన్ను రూ.8 వేలకు కోస్తున్నారని కొందరు రైతులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. టన్ను రూ.9 వేలకు తగ్గించి కోతలు కోసిన దళారులపై చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని సబ్ కలెక్టర్ ఇది వరకే హెచ్చరించారు. ఇప్పటికే చాలా మంది దళారులకు నోటీసులు కూడా వీఆర్‌వోలు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలను పాటించకపోతే ఇబ్బందులు పడతారని అధికారులు బహిరంగంగా చెప్పారు. ప్రస్తుతానికి 90 శాతం మంది టన్ను రూ.9 వేలకే కోతలు కోశారని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. పది శాతం మంది కాయలు మాగిపోతున్నాయని చెబుతున్నారని, దాంతో రైతును ఒప్పించి టన్ను రూ.8 వేలకు కోతలు కోసినట్లు తెలిసింది. ఏదిఏమైనా బొప్పాయి ధర విషయంలో ఇక దారికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. చిట్వేలి సరిహద్దు, బాలపల్లె, పుల్లంపేట చెక్‌పోస్టుల వద్ద లారీలను అధికారులు తనిఖీలు చేస్తున్నారు.



బాలపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ అమ్మవారు

గుర్రంకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ వ్రతం వేడుకలను మండల ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఇళ్లలో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలను ప్రత్యేకంగా చేయించారు. ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అర్చకులు వరలక్ష్మీ వ్రతం విశిష్టతను భక్తులకు వివరించారు. వరలక్ష్మీ వ్రతం ఆచరించడం వలన సకల శుభాలు, అఖండ సౌభాగ్యాలు, కలుగుతాయని సర్వమంగళ సంప్రాప్తి కోసం సకలాభీష్టాల కోసం వరలక్ష్మీదేవిని పూజించాలని తెలియజేశారు. స్త్రీలందరూ సామూహిక కుంకుమార్చన నిర్వహించి వరలక్ష్మీ దేవిని పూజించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే అరిగెలవారిపల్లె, తరిగొండ గ్రామాల్లో అక్కదేవతలకు పచ్చ వేయించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులకు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విస్తృతంగా మంత్రుల ప్రచారం

ఒంటిమిట్ట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శుక్రవారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నక్క ఆనందబాబు, పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మండలంలోని చిన్నకొత్తపల్లిలో, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ కొండమాచుపల్లెలో, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నరవకాటిపల్లె, మలకాటిపల్లె, చెంచుగారిపల్లె, సాలాబాద్ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. మంత్రి ఫరూక్ ఒంటిమిట్టలోని మసీదు వద్ద ప్రచారం నిర్వహించారు. అనంతరం ఒంటిమిట్టలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పత్తిపాటి పుల్లారావు, నక్క ఆనందబాబు, ఒంటిమిట్టలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వీరికి అన్ని గ్రామాల్లో బ్రహ్మరథం పట్టి మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. ఒంటిమిట్టలో జడ్పీటీసీ గెలుపు నల్లేరు మీద నడకేనన్నారు. మంచి మెజారిటీతో గెలుస్తామన్నారు. మా టార్గెట్ పులివెందుల గెలుపేనన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని, ఒంటిమిట్టను దక్షిణ అయోధ్యగా తీర్చిదిద్దే బాధ్యత మేము తీసుకుంటామన్నారు. ఒంటిమిట్టలో ప్రజల ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేస్తామన్నారు. టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు గజ్జల నరసింహారెడ్డి, ఎస్వీ రమణ, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, రాష్ట్ర కల్లుగీత కార్మికుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, మండల నాయకులు న్యాయవాది రామదాసు, నామాల వెంకటయ్య, హరీంద్రనాథరెడ్డి, శివారెడ్డి, రేవిళ్ల బాలమునయ్య, రోశయ్య, బోగా శంకరయ్య, చింతగింజల సుబ్రమణ్యం, ఎంపీటీసీ సుంకేసుల బాషా, కోనరాజుపల్లి బాషా, వీవీ రమణ వెంకటసుబ్బయ్య, సాదు శ్రీనివాసులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఒంటిమిట్టలో ప్రచారం చేస్తున్న మంత్రి ఫరూక్, నాయకులు హరిప్రసాద్, అమీర్‌బాబు తదితరులు



కొత్త మాధవరంలో ప్రచారం చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

అంతరిస్తున్న మామిడి తోటలు

● చెట్లను నరికేస్తున్న రైతులు



లారీల్లో తరలిస్తున్న నరికేసిన మామిడి చెట్లు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలకు పెట్టింది పేరుగా చెప్పుకునే రైల్వేకోడూరు నియోజకవర్గంలో తోతాపురి, బంగిన పల్లి, నీలం, రుమాని, చెరుకు రసం, హిమామ్ పసంద్ వంటి పలు రకాల మామిడికాయలు పండిస్తారు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, గుజరాత్ వంటి రాష్ట్రాలకు ఇక్కడి నుంచి మామిడికాయలు ఎగుమతి అవుతాయి. దీంతో ప్రతి ఏడాదీ రూ.100 నుంచి రూ.150 కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది మామిడి రైతులకు కష్టకాలం వచ్చింది. పంట దిగుబడి బాగానే ఉన్నా ధర పడిపోయింది. దీనికి తోడు కూలి, రవాణా ఖర్చులు కూడా పెరిగిపోవడంతో పాటు, దళారుల కారణంగా రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. కొంతమంది రైతులు మామిడి తోటలను వదిలేసి వెళ్లిపోవడంతో టన్నుల కొద్దీ కాయలు చెట్లకే వేలాడుతూ మగ్గిపోయాయి. ఇలాంటి దుర్భర పరిస్థితుల గతంలో ఎప్పుడు చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు మార్కెట్లో ఈ ఏడాది కేవలం 50 కోట్ల రూపాయల వ్యాపారం మాత్రమే జరిగింది. ఇది గతంతో పోలిస్తే చాలా తక్కువ. రైతుల కష్టాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడికాయకు కిలోకు రూ.8 ప్రోత్సాహకం ప్రకటించింది. అయితే, జ్యూస్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే మామిడి కాయలను కొనుగోలు చేస్తుండటంతో ఈ ప్రోత్సాహకం పెద్దగా ఉపయోగపడలేదు. కలెక్టర్ స్వయంగా రైతుల వద్దకు వచ్చి సమస్యలు పరిశీలించి, గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ ఇంకా అమలు కాలేదు. ధరలు లేకపోవడం, దళారుల దోపిడీ, ప్రభుత్వం నుంచి సరైన మద్దతు లభించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

మామిడి తోటల సాగుకు రైతులు ఒక్కో ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఖర్చు అవుతుంది. దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడం మార్కెట్లో ధరలు అస్థిరంగా ఉండటంతో పెట్టుబడి కూడా రావడం లేదని నిరాశకు గురవుతున్న రైతులు కొంతమంది తోటలను నరికివేస్తున్నారు. వచ్చే ఏడాది లోగా మామిడి రైతుల సమస్యలపై అధ్యయనం చేసి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు, సబ్సిడీలు, సకాలంలో రుణాలు వంటి చర్యల ద్వారా ప్రభుత్వం మామిడి రైతులకు అండగా నిలబడాలి లేదంటే కోడూరు మామిడి పంటకు గడ్డుకాలం తప్పదు.

ప్రతి ఏడాది తగ్గుతున్న విస్తీర్ణం

నియోజకవర్గంలో ప్రస్తుతం 22 వేల ఎకరాలో మాత్రమే మామిడి తోటలు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం సుమారు 27 వేల ఎకరాల్లో ఉన్న మామిడి తోటలు క్రమంగా తగ్గుతూ వచ్చి ఈ ఏడాదికి 22 వేల ఎకరాలకు పరిమితమయ్యాయి. గత ప్రభుత్వంలో కొంత భూమి నేషనల్ హైవేకు పోవడంతో ఎక్కువ శాతం మామిడి చెట్లను తొలగించారు. చీడ పీడలు, తెగుళ్ల సోకి, చెట్లు ఎండిపోతు న్నాయి. దీంతో దిగుబడి తగ్గిపోవడమే కాకుండా చెట్లు కూడా చనిపోతున్నాయి. ఈ సమస్య వలన రైతులు చెట్లను నరికేస్తున్నారు.

- భాస్కర్, ఉద్యానశాఖ అధికారి

గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశలేదు...

గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి దిగుబడి బాగానే వచ్చింది. అయితే గిట్టుబాటు ధర మాత్రం రాలేదు. దళారులు, జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం హెచ్చరించినా వారు సహకరించడం లేదు. మార్కెట్‌లో ఒక వ్యాపారి నుంచి ఇంకో వ్యాపారి వద్దకు సరుకు తీసుకెళ్తే నిర్మొహమాటంగా వద్దంటున్నారు. కనీసం మామిడి తోటలపై పెట్టిన ఖర్చు రావడం లేదు. అందుకే మామిడి చెట్లను నరికేస్తున్నానని ఓబులవారిపల్లి మండలం, వై.కోటకు చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



వై.కోట గ్రామంలో రైతు నరికేసిన మామిడి చెట్లు

హార్సిలీహిల్స్‌లో గాలిబండకు ముళ్ల కంచె



హార్సిలీహిల్స్‌లోని గాలిబండ వద్ద ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వద్ద సీఐ జీవన్ గంగనాథబాబు

బి.కొత్తకోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల ఆకర్షణ కోసం రూ.లక్షలతో సుందరీకరణ పనుల చేపట్టిన విషయం తెలిసిందే. వీటిని రెండు రోజుల కిందట కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రారంభించారు. పర్యాటకుల రక్షణ, కొండ మీద పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారు. రాత్రి పూట డీఎస్పీతో కలసి స్వయంగా హిల్స్ పైనున్న ప్రధాన కూడళ్లు సహా గాలిబండను పరిశీలించి మందుబాబులు గాలిబండ పైకి వచ్చి బహిరంగంగా మద్యం సేవించే విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రక్షణ పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆదేశాల్లో భాగంగా గాలిబండ ముఖద్వారంలో రాతి కూసాలు నాటించి ఫెన్సింగ్ వేయించారు. గురువారం బి.కొత్తకోట సీఐ జీవన్ గంగనాథబాబు హార్సిలీహిల్స్‌లో ఫెన్సింగ్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై హార్సిలీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం వినియోగం, ఆకతాయి చేష్టలపై పోలీసుల నిఘా వుంటుందన్నారు. పర్యాటకులు తమ తోటి వారికి ఇబ్బంది కలగకుండా హిల్స్ పర్యటన ముగించుకుని వెళ్లాలన్నారు.

యువకుడి బొటనవేలు కొరికేసిన కానిస్టేబుల్





వినోద్ బొటనవేలుకి గాయమైన దృశ్యం, కానిస్టేబుల్ వినోద్‌కుమార్

వీరబల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో ఏర్పడిన తగాదా కారణంగా ఓ కానిస్టేబుల్ ఓ యువకుడిపై దాడి చేయడంతో పాటు అతని బొటన వేలిని కొరికి వేశాడు. మండలంలోని ఈడిగపల్లికి చెందిన వెంకటేశ్వర్లు విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తు న్నాడు. శుక్రవారం తన కుమారుడు వినయ్‌తో కలసి వినోద్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన కారుపై దాడి చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వినోద్‌కుమార్ ఎడమ చేతి బొటన వేలిని వెంకటేశ్వర్లు కొరికివేశాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హాకీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన జట్లతో జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ (శాప్) శుక్రవారం రాయచోటి పట్టణంలోని రాజు ఒలంపియాడ్ స్కూల్ సమీపంలోని హాకీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి పోటీలకు హాకీ క్రీడాకారులను ఎంపిక చేసింది. ఎంపికైన జట్లు త్వరలో తిరుపతిలో జరగనున్న జోనల్ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాయి. అన్నమయ్య జిల్లా హాకీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు, జిల్లా హాకీ ఫౌండర్ సీ.చంద్రశేఖర్, శాప్ కోచ్ చంద్రశేఖర్, రాజు స్కూల్ హాకీ కోచ్ నారాయణ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు.

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం

ములకలచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శుక్రవారం తెల్ల వారుజామున భారీ వర్షం కురిసింది. భారీ ఉరుములు, మెరుపులతో కూడి వర్షం కురవడంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా ఉరుములు రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పెద్దమండ్యంలో 57.8 మి.మీటర్లు, బి.కొత్తకోటలో 55 మి.మీటర్లు, ములకలచెరువులో 42 మి.మీటర్లు, పెద్దతిప్పసముద్రంలో 37 మి.మీటర్లు, తంబళ్లపల్లెలో 36.4 మి.మీటర్లు, కురబలకోటలో 10 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో ప్రధాన వీధులు వర్షపు నీరు పొంగి పొర్లాయి. మురికినీట కాల్వలు పొంగి వీధుల్లో ప్రవహించాయి. ములకలచెరువులో ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయి.

యూరియా కోసం రైతుల నిరీక్షణ





టమోటా చెట్లు పీకేసి వరి సాగుకు సిద్ధంగా ఉన్న పొలం, యూరియా కోసం దుకాణం ముందు వేచి ఉన్న రైతులు

● అరకొరగా యూరియా నిల్వలు

రామసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి పంటలకు యూరియా వాడకం ఎక్కువగా ఉండడంతో కాలిఫ్లవర్, కొత్తమీర,, బీన్స్ తదితర పంటలకు యూరియా వాడకం అధికం కావడంతో యూరియా కొరత ఏర్పడింది. అయితే వ్యవసాయ అధికారులు, ఎరువులు విక్రయ డీలర్లు యూరియా అవసరాన్ని గుర్తించి నిల్వలు ఉంచుకోవడంలో అలసత్వం వహించడం వల్ల యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుందని తెలిసినా యూరియా నిల్వలు చేయకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని రైతులు అంటున్నారు. రామసముద్రం మండలంలో ప్రతి ఏడాది రబీ సీజన్ కంటే ఖరీఫ్‌లో వరి సాగు ఎక్కువగా ఉంటుంది. అయితే మండలంలో వరి సాగు టమోటా ధరపై ఆధారపడి ఎక్కువశాతం చెరువులు, కుంటల కింద టమోటా సాగు చేస్తారు. కాగా ఈ ఏడాది జూన్ జూలై నెలలలో టమోటా రెట్లు ఆశాజనకంగా లేకపోవడంతో టమోటా కాయలు అయిపోయాక చెట్లు పీకేసి వరి సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది కంటే ఈ ఏడాది వరి సాగు పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఇందుకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలు, ఎరువుల డీలర్ల దుకాణాలలో యూరియా నిల్వలు అధికంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వరినాట్లు వేసినప్పటి నుంచి వెన్ను వచ్చే దశ వరకు సుమారుగా రెండునెలలు పలుసార్లు వరికి యూరియా పిచికారీ చేయాల్సి ఉంటుందని ఇందుకు సరిపడా యూరియా నిల్వలు ఉండేలా వ్యవసాయాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొందరు ఎరువుల విక్రయ డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోదండ రామాలయంలో వరలక్ష్మీ వ్రతం

ఒంటిమిట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, శ్రావణకుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్‌లు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ రంగమంటపంలో ఆశీనులను చేశారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య వరలక్ష్మీవ్రతం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో వచ్చి వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు నవీన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.



వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ (ఆదివారం) ఉచిత వైద్యశిబిరంనిర్వహిస్తున్నామని s పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభంలో ప్రజలు రోగాల బారీన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్యశిబిరం శంకరాపురం వీధిలోని మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గుండె సంబంధిత, చిన్నపిల్లల, నరాలు, ఎముకలు సంబంధిత వ్యాధులతో పాటు బీపీ, షుగర్, థైరాయిడ్, ఊపిరితిత్తులు, మెదడు, వెన్నముఖ, విషజ్వరాలు సంబంధించిన వైద్యులు పాల్గొని చికిత్సలు అందిస్తారని తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజలకు ఉచిత మెగా వైద్యశిబిరం కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రటరి యల్లయ్య, అబ్బాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరం కరపత్రాలను పంచుతున్న ఇర్ఫాన్‌బాషా

వైకల్య శాతం అనుసరించి ఉపకరణాలు



పీలేరులో శిబిరానికి హాజరైన ప్రత్యేక ప్రతిభావంతులతో అధికారులు

పీలేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైకల్య శాతం అనుసరించి విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ఉచిత ఉపకరణాలు అందజేస్తుందని కడప, అన్నమయ్య జిల్లాల విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు ఆర్వీ కృష్ణకిశోర్ పేర్కొన్నారు. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ఉపకరణాల లబ్ధిదారుల ఎంపిక శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు కడప జిల్లాలో 22 శిబిరాలు నిర్వహించి ఉపకరణాలు అందించేందుకు 4700 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. జిల్లాలో 21 శిబిరాలకు ఇప్పటి వరకు 18 శిబిరాలు నిర్వహించామని, మిగిలిన మూడు శిబిరాలు కూడా పూర్తయ్యాక లబ్ధిదారుల మొత్తం సంఖ్య తేలుతుందన్నారు. శిబిరానికి హాజరవుతున్న విభిన్న ప్రతిభావంతుల వద్ద ఉన్న సదరం ధృవపత్రాల్లోని వైకల్య శాతాన్ని లెక్కలోకి తీసుకుని ఉపకరణాలు అందజేస్తామన్నారు. 86 శాతానికిపైగా వైకల్యం ఉన్న వారికే మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు అందే అవకాశం ఉందన్నారు. ఉచిత ఉపకరణాల కోసం ఎంపికైన ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.5 వేలు మొదలుకుని రూ.47 వేలు విలువైన ఉపకరణాలు ఉచితంగా అందజేస్తుందన్నారు. జిల్లా వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఉప సహాయ సంచాలకుడు శ్రీకాంత్, పీలేరు ఎంపీడీఓ శివశంకరయ్య, ఐఈడీఎస్ లలితకుమారి, ఐఈఆర్‌టీ ధరణీ జ, సీఆర్‌పీ మురళీధర్ రాజు, పీలేరు ఆదర్శ వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు పీవీ చలపతి, కార్యదర్శి కేవీ రమణ, సభ్యులు పాల్గొన్నారు.

కలకడ: అర్హులైన దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాటవారిపల్లె హైస్కూల్‌లో దివ్యాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. 76 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. అర్హులకు ప్రభుత్వం సరఫరా చేసే వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, వీల్ చైర్లు పంపిణీ చేస్తామని చెప్పారు.

ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి దేవస్థానానికి ధర్మకర్త మండలి నియామకం కోసం విజయవాడ దేవాదాయ శాఖ కమిషనర్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 26వ తేదీలోపు ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి కోసం ఆశావహులు అన్నమయ్య జిల్లా, రాయచోటిలోని జిల్లా దేవాదాయ శాఖ అధికారి కార్యాలయానికి చేరేలా దరఖాస్తు సమర్పించాలని కోరారు. లేటుగా చేరిన, చేర్చిన దరఖాస్తులు చెల్లవని మదనపల్లె గ్రూప్ టెంపుల్ ఈఓ రమణ ఓ ప్రకటనలో వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బస్సుకింద పడి చిన్నారి మృతి చెందిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక విజయవాణి పాఠశాల బస్సు డ్రైవరు నిర్లక్ష్యానికి నాలుగేళ్ల చిన్నారి దివాకర్ మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. పాఠశాల వ్యాన్‌కు క్లీనర్‌ను ఏర్పాటు చేయకపోవడమే ప్రధానం కారణంగా విద్యార్థి మృతి చెందడంతో బాధితుల ఫిర్యాదుపై పాఠశాల కరస్పాండెంట్ రఘుపతినాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు నాయుడు, డ్రైవర్ గురుప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దౌర్జన్యం చేసిన నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టివారిపల్లె బైపాస్ రోడ్డులో గురువారం పశువులు తరలిస్తున్న లారీని ఆపి, వారిపై దౌర్జన్యం చేసి పదివేలు డబ్బు డిమాండ్ చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె తాలుకా పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం, తిరువన్నామలై జిల్లా, అరణితాలుకా మయూరు వాసులు బాలాజీ, కమలకన్నన్ రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం అనంతపురం జిల్లా గోరంట్ల పశువుల సంత నుంచి రెండు ఎద్దులు, ఒక ఆవు, రెండు దూడలు తరలిస్తున్నారు. వీరి వాహనం చైన్నై- ముంబై జాతీయ రహదారి తట్టివారి పల్లె వద్ద ఆర్టీఓ ఆఫీస్ వద్ద మదనపల్లె వాసులు చేగూరి నాగార్జున, సురేష్‌కుమార్ రైతుల వద్ద నుంచి పశువులకు సంబంధించిన పేపర్స్ లొక్కుని, చంపుతామని బెదిరించి, పదివేలు రూపాయలు డిమాండ్ చేశారు. అనంతరం వారి అధీనంలోని వాహనాన్ని పట్టణంలోకి రాకుండా బైపాస్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో నిలిపి వాహనంలోని కమలకన్నన్ మొబైల్ ఫోన్స్ ద్వారా ఓనర్ మురళీదాస్ మాట్లాడి పశువులను ఇక్కడే వదిలేసి వెళ్లాలని డిమాండ్ చేశారని తెలిపారు. వారు ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో తాలుకా సీఐ కళా వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

● టీడీపీలో చేరిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ



మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

ఒంటిమిట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ ఖాళీ అయ్యేలా కనపడుతోంది. ఇప్పటికే వైసీపీకి చెందిన ముఖ్య నేతలు రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో భారీగా చేరుతున్నారు. శుక్రవారం ఎంపీపీ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ బోగా గీతాదేవిలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చమర్తి జగన్‌మోహన్‌రాజుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే మండలంలోని మలకాటిపల్లె గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. మరో రెండు రోజుల్లో ఇంకొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న పలు అభివృద్ధి పనులను చూసి టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, న్యాయవాది రామదాసు, గజ్జల శ్రీనివాసరెడ్డి, బోగా శంకరయ్య ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

అండర్-22 జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

వాల్మీకిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-22 జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక వాల్మీకిపురంలో నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెలెక్షన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, సెక్రటరీ రవిచంద్ర, ఎస్ఐ చంద్రశేఖర్, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, పీడీలు కిరణ్, రెడ్డివరప్రసాద్, సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అండర్-22 బాలికల జట్టు

కె.హిమశ్రీ, కౌశల్య(మదనపల్లె), గాయత్రి, హర్షిత, స్వాతి, మమేత, జి.గాయత్రి (తరిగొండ), భవ్యశ్రీ (గుర్రంకొండ), హర్షిత, రేణుక(సీటీఎం), హిమజ, వక్షశ్రీ, ఆరీఫా, వర్షిత, శాన్విత(వాల్మీకిపురం).

అండర్-22 బాలుర జట్టు

కార్తికేయ, రెడ్డిశేఖర్, క్రిష్ణకౌశిక్, అరవింద్, తరుణ్‌కుమార్, నియాజ్ (వాల్మీకిపురం), చైతన్య, దీపేష్, మౌనీష్, వెంకటసాయి, నిహార్ (మదనపల్లె), హేమనాథ్(తరిగొండ) జిల్లా జట్లకు ఎంపికయ్యారు.



అండర్-22 జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైన బాలబాలికలు

ప్రభుత్వ పాఠశాలల్లో... మెరుగైన విద్యా ప్రమాణాలు

● పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికలు

● జిల్లా, మండలస్థాయిలో అకడమిక్ కమిటీల ఏర్పాటు



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి వివిధ పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా బోధన, వసతులు కల్పిస్తోంది. అయినా విద్యా ప్రమాణాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవని కేంద్రం నుంచి వచ్చిన రెండు సంస్థల సర్వేల్లో స్పష్టమైంది. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికి కూడికలు, తీసివేతలు కూడా రావడం లేదని, ఇంగ్లీష్ పదాలు చదవలేకపోతున్నారని నివేదికలు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో మరింత వైవిధ్యంగా విద్యాప్రమాణాలు మెరుగుపరిచేలా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నారు. ఆ దిశగా అకడమిక్ కమిటీలను నియమించి, పాఠశాలలను పర్యవేక్షించాలని నిర్ణయించారు. కమిటీలను సైతం నియమించారు. కమిటీల పనితీరు, విద్యాప్రమాణాలు పెంపునకు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్రస్థాయిలో సమీక్షించనున్నారు.

జిల్లాలో 3110 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో శాటిలైట్ పాఠశాలలు 121, ఫౌండేషన్ పాఠశాలలు 281, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 1840, మోడల్ ప్రైమరీ పాఠశాలలు 431, యూపీ పాఠశాలలు 37, ఉన్నత పాఠశాలలు 249, బేసిక్ ప్రైమరీతో కూడిన ఉన్నత పాఠశాలలు 102, మోడల్ స్కూల్‌తో కూడిన ఉన్నత పాఠశాలలు 49 ఉన్నాయి. వీటిలో విద్యాప్రమాణాల పెంపు, పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం జిల్లా, మండలస్థాయిలో అకడమిక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

కమిటీల పర్యవేక్షణ ఇలా...

జిల్లా స్థాయిలో డీఈఓ చైర్మన్‌గా, సమగ్రశిక్ష ఏపీసీ, ఏసీ, డీసీఈబీ కార్యదర్శి, ముగ్గురు ఎంఈఓలు సభ్యులుగా ఉంటారు. ప్రతి సబ్జెక్టుకు నలుగురు నిపుణులైన స్కూల్ అసిస్టెంట్ల చొప్పున 24 మంది టీచర్లను, ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5వ తరగతి వరకు పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీలో నలుగురు ఎస్‌జీటీ కేడర్‌లో నిపుణులైన టీచర్లకు అవకాశం కల్పించారు. మండల స్థాయిలోనూ నిరంతరం పర్యవేక్షణకు ఎంఈఓ-1, ఎంఈఓ-2, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ముగ్గురు ఎస్‌జీటీలకు కమిటీలో అవకాశం ఇచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు బృందాలుగా పాఠశాలలను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలు, ప్రమాణాల పెంపునకు ఎలా బోధిస్తున్నారు.. ఎన్‌రోల్‌మెంట్, విద్యార్థులు, టీచర్ల హాజరు, పాఠశాలలకు వచ్చిన నిధులు, వాటితో ఎలాంటి వసతులు కల్పించారు.. తదితర వివరాలను పరిశీలిస్తారు. తనిఖీ చేసిన పాఠశాలలోని పరిస్థితులను కమిటీ రాసుకోవాలి. అకడమిక్ కమిటీలతో రాష్ట్రస్థాయిలో మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ సమీక్ష నిర్వహిస్తారు. కమిటీల పనితీరు, గుర్తించిన సమస్యలపై ఆరా తీస్తారు. ఆ దిశగా ఇప్పటికే కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో అమలుకు అధికారులు కుస్తీ పడుతున్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకే...



విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు అకడమిక్ కమిటీ దోహదపడుతుంది. సబ్జెక్టు నిపుణుల ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగు పడే అవకాశం ఉంటుంది. అలాగే ఉపాధ్యాయులు పిల్లలకు ఎలా బోధన చేస్తే సులువుగా నేర్చుకోగలరో అధ్యయనం చేసి.. విద్యార్థులకు బోధన చేసేందుకు ఉపయోగపడుతుంది. కమిటీ సమావేశాలు పాఠశాల సమయంలో కాకుండా పాఠశాల ముగిసిన తర్వాత (సాయంత్రం 4గంటల తర్వాత) నిర్వహించు కోవాలి. పాఠశాల సెలవు దినాలలో నిర్వహించాలి. ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని ఆ దిశగా అకడమిక్ కమిటీలు పనిచేయాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. త్వరలో మండల స్థాయి సమావేశాలు కూడా నిర్వహించి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తారు.

- షంషుద్దీన్, డీఈఓ

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి



ప్రమాదస్థలి వద్ద తీవ్రగాయాలతో శ్రీనివాసరెడ్డి

వల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రోడ్డులో తోళ్లగంగనపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డి.శ్రీనివాసులరెడ్డి (46) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ పెద్ద ఓబన్న వివరాల మేరకు... వల్లూరు మండలం గంగాయపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి కడప కోర్టులో న్యాయవాదిగా పని చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై కడపకు వెళుతుండగా సత్యా గ్రీన్‌సిటీ వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వైపు ఢీకొన్నాడు. దీంతో శ్రీనివాసులరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించగా.. చికిత్స చేస్తుండగా సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. శ్రీనివాసులరెడ్డికి భార్య వసంత, ఆరు నెలల పాప ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని గొర్రెలు మృతి



రోడ్డు పక్క మృతి చెందిన గొర్రెలు

ముద్దనూరు ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తాడిపత్రి రోడ్డులోని ఈద్గా సమీపంలో శుక్రవారం ఉదయం లారీ ఢీకొనడంతో 6 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. ముద్దనూరు వైపు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న లారీ ఈద్గా వద్ద రోడ్డు దాటుతున్న గొర్రెల మందపై దూసుకెళ్లింది. దీంతో జాఫర్ అనే వ్యక్తికి చెందిన 6 గొర్రెలు మృతి చెందాయి.

స్టాప్ బోర్డును ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన మునీంద్ర

కమలాపురం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మూడు రోడ్ల కూడలిలో స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేసిన స్టాప్ బోర్డును ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మునీంద్ర తన సొంత పనులు ముగించుకొని మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మూడు రోడ్ల కూడలిలో ప్రమాదవశాత్తు స్టాప్ బోర్డును ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ప్రాంతంలో రహదారి గోతులతో ప్రమాదకరంగా ఉందని.. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

● తప్పిన ప్రమాదం ● సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు



పొలాల్లోకి దూసుకుపోయిన కారు

కాశినాయన, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం పిడుగుపల్లె గ్రామాల మధ్య పోరుమామిళ్ల నుంచి గిద్దలూరు వెళ్లే ప్రదాన రహదారికి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. దీంతో స్తంభం విరిగి పడింది. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఉంది. అయితే కారు అలాగే పొలాల్లోకి దూసుకుపోవడంతో ప్రమాదం తప్పింది. కారు ముందు భాగం దెబ్బతింది. అదృష్టవశాత్తు కారులో ఉన్నవారు ఎలాంటి గాయాల బారిన పడకుండా సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. సమీప గ్రామమైన చెన్నారెడ్డిపల్లెలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతున్న క్రమంలో ఈసంఘటన చోటుచేసు కున్నట్లు సమాచారం.

ప్రైవేటు ఆస్పత్రులపై ఆకస్మిక తనిఖీలు

● నిబంధనలకు లోబడి సేవలు అందించాలి ● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత



ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారుల బృందం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో వైద్యాధికారులు మూడు బృందాలుగా విడిపోయి ప్రతి బృందం సుమారు 30 ఆస్పత్రులను తనిఖీ చేసేలా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు బృందం ఆస్పత్రులపై సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా డాక్టర్ల విద్యార్హత, రిజిస్ట్రేషన్, బయోమెడికల్ వేస్టేజీ నిర్వహణ, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, నోఅబ్జక్షన్ సర్టిఫికెట్, లైసెన్సులు, చికిత్స రేట్లు వంటి అంశాలపై అధికారులు పరిశీలించారు. కొన్ని ఆస్పత్రుల్లో రేట్ల ప్రదర్శన లోపం ఉన్నట్లు గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్పష్టమైన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రులలో స్టెబిలైజేషన్ పద్ధతులు, నర్సింగ్ సిబ్బంది అర్హత, రెఫరల్ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఐవీఎఫ్, ఐవీఐ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. పట్టణంలో అక్షయ ఆస్పత్రి, గాయత్రీ ఐవీఎఫ్ వంటి సెంటర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్నాయన్నారు. విశ్వల్యాపరోస్కోపీ, ఐవీఎఫ్ సెంటర్‌పై తనిఖీ నిర్వహించగా ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయి పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చేవరకు ఆస్పత్రులలో ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయకూడదని, వైద్యసేవలు అందించరాదని హెచ్చరించారు. ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యానికి మాత్రమే పరిమితం కావాలని, ల్యాబ్‌లు, ఫార్మసీ వంటి సౌకర్యాలను సమకూర్చుకోరాదన్నారు. నాలుగు రోజుల్లో అన్ని ఆస్పత్రులకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసి ఆరోగ్యశాఖ డాక్టరేట్‌కు వివరాలను పంపుతున్నట్లు వివరించారు.

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

కలసపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గురువారం చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో పలువురిని విచారించారు. ఫోరెన్సిక్ సైంటిఫిక్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆధారాలను సేకరించారు. కాగా, పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించినట్లు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నిందితుడికి కఠినశిక్షపడేలా అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బద్వేల్ సీఐ నాగభూషణం, కలసపాడు ఎస్‌ఐ తిమోతి, పోరుమామిళ్ల ఎస్‌ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

కొండాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శివప్రసాద్‌రెడ్డికి రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. గండిలో శ్రావణశనివారం సందర్భంగా డ్యూటీ నిమిత్తం శుక్రవారం కొండాపురం నుంచి బైకులో వెళుతుండగా పులివెందుల సమీపంలోని రాయలపురం వద్ద బైక్‌ను ఆటో ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో బైక్ కిందపడటంతో అతనికి చేయి విరిగింది. చికిత్స నిమిత్తం పులివెందుల ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పెన్నాపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మైలవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి శనివారం 10 వేల క్యూసెక్కుల నీటిని సోమశిల జలశయానికి పెన్నానది ద్వారా విడుదల చేశామని.. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలవరం జలాశయ అధికారులు శుక్రవారం తెలిపారు. పెన్నా పరివాహక ప్రాంతాలు అయిన వేపరాల, దొమ్మరనంద్యాల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పట్టణ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రజకులు, రైతులు, స్కూలుకు వెళ్లే విద్యార్థులు, మత్స్యకారులు నదికపరివాహక ప్రాంతంలో వెళ్లడం నిషేదించారన్నారు. నదిలోకి వెళ్లకుండా పిల్లలపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం సుబ్బిరెడ్డి ఇంటివద్ద రోడ్డు నిర్మాణం విషయమై జరిగిన ఘర్షణ నేపధ్యంలో మనస్థాపం చెంది విషద్రావణం తాగాడు. కాగా, సుబ్బిరెడ్డి కుమార్తె లక్ష్మీదేవి తన తండ్రి మృతిపై కొందరిపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పూర్తి కోణంలో విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డిపేట సమీపంలో శుక్రవారం పొలాల్లో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.4,600 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చినుకు పడితే చెరువే..

● కడప రోడ్డులో, ఎన్‌హెచ్ రోడ్డులో భారీగా నిలుస్తున్న వర్షపునీరు ● శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల వినతి



ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు కాంప్లెక్స్ వద్ద నిలిచిన వర్షపు నీరు

ఎర్రగుంట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎర్రగుంట్లలో ప్రధాన రోడ్లలో, వీధుల్లో డ్రైనేజీలు లేక నరకం అనుభవిస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి వేసిన నేషనల్ హైవేల్లో సైతం నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపైనే నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండేళ్ల క్రితం ఎర్రగుంట్లలో వేసిన జాతీయ రహదారిలో కడపరోడ్డులో ఇరువైపులా డ్రైనేజీ నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాడు అధికారులు చేసిన తప్పిదాలకు పాలకులు కూడా వంత పాడటంతో ఈ పరిస్థితి దాపరించిందని ప్రజలు వాపోతున్నారు. ఎన్‌హెచ్‌కు ఇరువైపులా డ్రైనేజీకి ప్రతిపాదనలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారాన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అలాగే స్థానిక నిధులు భారీగా కేటాయించి టెండర్లు పూర్తయినా పనులు చేయించుకోలేని దుస్థితి ఏర్పడింది. దీంతో మంజూరైన పనులు కూడా ఆగిపోయి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

● తీవ్ర ఇబ్బందులు

కడప రోడ్డులోని మార్కెట్‌యార్డు కాంప్లెక్స్ వద్ద, పాత జేకే వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోతున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే భారీగా నీరు ఆగడంతో వాహనచోదకులకు, దుకాణదారులకు ఇబ్బందిగా మారింది. వర్షపునీరు నిలవడం వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు వ్యాపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

గండికోట నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల



మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి రెండు గేట్ల ద్వారా మైలవరం జలాశయానికి శుక్రవారం సాయింత్రం 5వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేసేందుకు ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో శుక్రవారం 15,800 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం గండికోట నుంచి సీబీఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 15.63 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

వాహనాలు తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సిద్దవటం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల దృష్ట్యా సిద్దవటం మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారిపై మాధవరం వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి గురుప్రసాద్ మాట్లాడుతూ ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు నియంత్రణ కోసం ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈఈ సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజంపేట పట్టణం, సరస్వతిపురం, తాళ్లపాక సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం, విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

అప్పులు చేసి దాహం తీరుస్తున్నాం..

● 57 గ్రామాల్లో తీవ్రంగా తాగునీటి సమస్య
● ఆరు నెలలుగా అందని నీటి బిల్లులు ● ట్యాంకర్ల యజమానుల ఆవేదన

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు తాగునీరు సరఫరా చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్న తమకు బిల్లులు చెల్లించకుండా అధికారులు వేధిస్తున్నారని ట్యాంకర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి వర్షాలు చాలినంతగా కురవకపోవడంతో మండలంలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో 57 గ్రామాల్లో వర్షాకాలంలో కూడా నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆదేశాల మేరకు పలువురు ట్యాంకర్ల యజమానులు గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దాదాపు కోటి రూపాయలతో అన్ని గ్రామాల్లో బోర్లు వేసినా దాదాపు 30 బోర్లలో నీరు పడలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకూడదని ప్రతి గ్రామానికి రెండు నుంచి నాలుగు ట్యాంకర్లతో తాము నీటిని సరఫరా చేస్తున్నా బిల్లులు మాత్రం చెల్లించడం లేదని ఆవేదన చెందుతున్నారు. మార్చి నుంచి ఒక్కొక్కరికి దాదాపు రెండు లక్షల రూపాయలకు పైగానే బిల్లులు రావాలని ట్యాంకర్ల యజమానులు మల్లి కార్జునబాబు, గంగయ్య వాపోతున్నారు.

ఇప్పటికైనా కూడా బిల్లులు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామాలకు సరఫరా చేసేందుకు ఒక్కో ట్యాంకరుకు రూ.200 చొప్పున వ్యవసాయ బావుల యజమానులకు చెల్లించి నీరు కొనుగోలు చేస్తున్నామని, కనీసం ఆ ఖర్చుకు కూడా తమ వద్ద డబ్బులు లేకుండా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేయాలని వారు కోరారు.



ట్యాంకరు నీటిని పట్టుకుంటున్న గ్రామీణులు

ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు అందిస్తున్నాం



ప్రజలు ఇబ్బందులు పడకుండా డబ్బు పెట్టి నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నాం. మార్చి నెల నుంచి ఇంతవరకు బిల్లులు రావడం లేదు. బిల్లులు మంజూరు చేయాలి.

- నాగార్జున, నీటి ట్యాంకర్ యజమాని

బిల్లులు పెట్టాం

మార్చి నుంచి నీళ్ల ట్యాంకర్ల యజమానులకు బిల్లులు పెట్టాము. త్వరలో నీళ్ల ట్యాంక్ యజమానుల ఖాతాల్లో బిల్లులు పడతాయి.

- కిశోర్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



రాజంపేట: ఉదయగిరి యల్లమ్మ ఆలయంలో వ్రతం చేస్తున్న మహిళలు



మాధవరంలోని గంగాభవాని ఆలయంలో వ్రతం ఆచరిస్తున్న మహిళలు

రైల్వేకోడూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహించారు. గుండాలపల్లెలో మారెమ్మ, రైల్వేకోడూరు అరుంధతి వాడలో మాతమ్మ, బలిజవీధిలో గంగమ్మ, అంకాళమ్మ, కన్యకాపరమేశ్వరి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి లోను వరలక్ష్మీవ్రతం నిర్వహించారు.

రాజంపేట టౌన్: పట్టణంలోని అమ్మవారిశాల, చౌడేశ్వరిదేవి ఆలయం, సాధు కామాక్షమ్మ, ఉదయగిరి యల్లమ్మ, బోయనపల్లెలోని మహాలక్ష్మీ, చౌడేశ్వరి, మహాలక్షమ్మ ఆలయాల్లో, వెంకటరాజంపేట మహంకాళి ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించారు. వరలక్ష్మీవ్రతం సందర్భంగా ఆలయ నిర్వాహకులు పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వెండి రథంపై ఊరేగించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న వారికి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

మాతంగ మఠం ఆశ్రమంలో..

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని దొర్రిచెరువుల సమీపంలో మాతంగ నందగిరిస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాతా నందగిరిస్వామి వచ్చిన మహిళలకు చీర, సారె, పండ్లు, ఫలహారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని మాధవరంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా గంగాభవాని శీతల గంగమ్మకు పూజలు నిర్వహించారు. మహిళకు పసుపు, కుంకుమ, గాజులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో అరవపల్లె ఎన్టీఆర్ నగర్‌లో వరలక్ష్మీవ్రతం పురస్కరించుకుని మహిళలు వేకువజామునే నిద్రలేచి ఇళ్లముందు రంగవల్లులు చేసి అందంగా తీర్చిదిద్దారు. గుమ్మాలకు అరటి, మామిడి తోరణాలు కట్టి అలంకరించారు. అమ్మవారిని అందంగా అలంకరించి ఇష్టమైన ప్రసాదాలు తయారు చేసి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. అనంతరం వాయనాలను ఇచ్చి పుచ్చుకున్నారు.

సంబేపల్లె: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం మంచాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నారు. ప్రతి ఇంట మహిళలు తలంటి స్నానాలు ఆచరించి వరలక్ష్మీదేవిని పసుపు, కుంకుమ, గాజులు, పుష్పాలతో అలంకరించి, ఆయురారోగ్యాలను సుఖ సంతోషాలను సౌభాగ్యాలను ప్రసాదించాలంటూ పూజలు నిర్వహించారు. ముత్తైదువులకు పసుపు, కుంకుమ సర్పించారు. శ్రావణ శుక్రవారం విశేష పూజలు చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రామాపురం, ఆంధ్రజ్యోతి 8 (ఆంధ్ర జ్యోతి): యువత రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలనిఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని గువ్వలచెరువు బస్టాండు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వా హనదారులు తమవద్ద లైసెన్సులు, పర్మిట్లు, హెల్మెట్ తప్పకుండా ఉంచుకోవాలన్నారు. గువ్వలచెరువులో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో గువ్వలచెరువు గ్రామస్తులు, వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న మేడా విజయ శేఖర్ రెడ్డి

నందలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త చాపరాపల్లెలో శుక్రవారం గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠిం చారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ భువనబోయిన లక్ష్మీనరసయ్య, ఎంపీటీసీ సభ్యుడు భువనబోయిన పెంచలయ్య, టీడీపీ నాయకులు చుక్కా యానాది, చుక్కా వెంకటేశ్వరయ్య, గుజ్జల ఈశ్వరయ్య, టీడీపీ కార్యకర్తలు, మేడా అభిమానులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్లు ధరించిన సిబ్బందితో ఏఎస్పీ రామ్‌నాథ్ హెగ్డే

ఓబులవారిపల్లె, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతలో భాగంగా ఓబుల వారిపల్లె పోలీసు స్టేషన్ సిబ్బందికి చలంపాలెం గ్రామానికి చెందిన ఏనుగుల రవిరాజు అందించిన హెల్మెట్లను ఏఎస్పీ రామ్‌నాథ్ హెగ్డే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది అందరూ మోటారు బైకు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్‌లను పెండింగ్‌లో ఉన్న కేసులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్డీస్‌కాలనీ రామాలయంలో ఉత్సవాలు ప్రారంభం

● భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం ● 220 కలశాల ఊరేగింపు

రాయచోటిటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డీస్‌కాలనీ రామాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఉతవాలను ప్రారంభించారు. మొదటి రోజు వరలక్ష్మి వ్రతం నిర్వహించడంతో పాటు 220 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. 42 నెలలుగా ప్రతి నెల నిర్వహిస్తున్న హోమాలు, సీతారాముల కల్యాణం ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. శనివారం ఉదయం పూజలు, అభిషేకాలు, మూల విగ్రహాలకు అభిషేకాలు, సుందరకాండ, వేద పారాయణం, భరతనాట్య ప్రదర్శన ఉంటాయన్నారు. ఉదయం 10.30 గంటలకు కావలి వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు సూరపురాజు వెంకట్రామరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం అన్నదానం ఉంటుందని తెలియజేశారు. 10వ తేదీన కుంభాభిషేకంతో పాటు సీతారాముల పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కావలి వెంకటసుబ్బరెడ్డి, ఆలయ అర్చకులు ప్రభాకరశర్మ తెలిపారు.



కలశాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పలు అభివృద్ధి కార్య క్రమాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అ రవ శ్రీధర్, యువ నాయ కులు ముక్కా సాయి వికాస్ రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని మంగంపేటలో నూతన లేఅవుట్ ఆర్‌ఆర్-5లో మాతమ్మ గుడి, బాలిరెడ్డిపల్లెలో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన టీడీపీ సీనియర్ నాయకులు గజ్జల రమణారెడ్డిని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ సుధాకర్, సీనియర్ నాయకులు కల్లా చలపతి, అను మలగుండం చంద్రమోహన్, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి చెన్నరాయుడు, తల్లెం రమణారెడ్డి, సుకుమార్‌రెడ్డి , జీవీరెడ్డి , కేపీ నరసింహారెడ్డి, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గాలివీడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలందించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత ఉర్దూ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌ఏ మున్వర్ బాషా అన్నారు. ఈ పాఠశాల నుంచి బది లీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం ఉదయం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులు అత్తార్ రియాజ్‌బాషా, ఆఫయాస్ బాషా, సైదా రహమతున్నీషా, ఫాతిము న్నీసా, లిల్లీపుష్పరాణి, అజ్మీర్‌బాను తో పాటు పూర్వం ఈ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు తాజుద్దీన్ బాబా, హఫీజున్నీషా, చాంద్‌బాషా, సయ్యద్ జాఫరుద్దీన్, సమీరాబానును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ ఆస్మా, అమ్మాజీ, వైస్ చైర్మన్ మహమ్మద్, చాన్‌బాషా, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ నాగరాజా, కంప్యూటర్ ఆపరేటర్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు షేక్. ఫయాజ్, గోవింద్‌రెడ్డి, ఆయా బీబీజాన్, నైట్ వాచ్‌మన్ ఖాదర్‌వలి, విద్యార్థులు, తల్లిదండ్రుల పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల అరెస్ట్ సరికాదు

రాజంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యుత్ కార్మికులను పోలీసులు అడుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ విమర్శించారు. శుక్రవారం పట్టణం లోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యలను కూటమి నేతలు ఎన్నికల సమయంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్ చేస్తామని చెప్పారు. కానీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వ అధికారులకు, విద్యుత్ యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించ డం లేదన్నారు. విద్యుత్ సంస్థలో పోస్టులు భర్తీ చేయకుండా ఉన్న కార్మికులపైనే పనిభారం మోపుతున్నారన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యల ను పరిష్కరించకుండా గొంతునొక్కడం సరికాదని, వెంటనే పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

కొండమాచుపల్లెలో వేమన సతీష్ ప్రచారం



కొండమాచుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న వేమన సతీష్

ఒంటిమిట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమాచుపల్లెలో శుక్రవారం రాష్ట్ర గ్రామీణ ఖాదీ పరిశ్రమశాఖ చైర్మన్ కేకే చౌదరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధతో కలిసి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీష్ వేమన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ విజయం ద్వారా మండల అభివృద్ధికి అడుగులు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టీడీపీ నాయకురాలు పత్తిపాటి కుసుమకుమారి నాయకులు రోశయ్య, వెంకటసుబ్బయ్య, సాదు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

రాయచోటి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సమస్యలపై ఈ నెల 10, 11 తేదీల్లో మదనపల్లిలో నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా 2వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జీ. ఈశ్వరయ్య, హరినాథ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో పరిశ్రమలు చేసి వలసలు నివారించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మించాలని, హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా సాగునీరు, తాగునీరు అందించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పథకాల్లో పనిచేస్తున్న చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాలు నివారించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కోస్ వర్కర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఆగస్టు 10, 11 తేదీల్లో మదనపల్లిలో జరుగుతున్న సీపీఐ జిల్లా 2వ మహాసభల్లో జిల్లాలోని ఏఐటీయూసీ నాయకులు, అనుంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



నిలిచిపోయిన వాహనాలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై జాతీయ రహదారి చిన్నఓరంపాడు నుంచి ముక్కావారిపల్లె మధ్యభాగంలో గురువారం మ. ధ్యాహ్నం కంటైనర్ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయింది. దానిని పక్కకు తీసేందుకు భారీ క్రేన్లను వినియోగించడంతో సాయంత్రం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ మహేష్ పోలీసు సిబ్బందిని పంపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీ కరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ట్రాఫిక్ ను అంతరాయం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

అంతరిస్తున్న మామిడి తోటలు

● చెట్లను నరికేస్తున్న రైతులు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలకు పెట్టింది పేరుగా చెప్పుకునే రైల్వేకోడూరు నియోజకవర్గంలో తోతాపురి, బంగిన పల్లి, నీలం, రుమాని, చెరుకు రసం, హమామ్ పసంద్ వంటి పలు రకాల మామిడికాయలు పండిస్తారు. మహా రాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, గుజరాత్ వంటి రాష్ట్రాలకు ఇక్కడి నుంచి మామిడికాయలు ఎగుమతి అవుతాయి. దీంతో ప్రతి ఏడాదీ రూ.100 నుంచి రూ.150 కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది మామిడి రైతులకు కష్టకాలం వచ్చింది. పంట దిగుబడి బాగానే ఉన్నా ధర పడిపోయింది. దీనికి తోడు కూలి, రవాణా ఖర్చులు కూడా పెరిగిపోవ డంతో పాటు, దళారుల కారణంగా రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. కొంతమంది రైతులు మామిడి



లారీల్లో తరలిస్తున్న నరికేసిన మామిడి చెట్లు

తోటలను వదిలేసి వెళ్లిపోవడంతో టన్నుల కొద్దీ కాయలు చెట్లకే వేలా డుతూ మగ్గిపోయాయి. ఇలాంటి దుర్భర పరిస్థితుల గతంలో ఎప్పుడు చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు మార్కెట్లో ఈ ఏడాది కేవలం 50 కోట్ల రూపాయల వ్యాపారం మాత్రమే జరిగింది. ఇది గతంతో పోలిస్తే చాలా తక్కువ. రైతుల కష్టాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడికాయకు కిలోకు రూ.8 ప్రోత్సాహకం ప్రకటించింది. అయితే, జ్యూస్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు సిండి కేట్‌గా మారి తక్కువ ధరకే మామిడి కాయలను కొనుగోలు చేస్తుండటంతో ఈ ప్రోత్సా హకం పెద్దగా ఉపయోగ పడలేదు. కలెక్టర్ స్వయంగా రైతుల వద్దకు వచ్చి సమస్యలు పరిశీలించి, గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ ఇంకా అమలు కాలేదు. ధరలు లేకపోవడం, దళారుల దోపిడీ, ప్రభుత్వం నుంచి సరైన మద్దతు లభించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

మామిడి తోటల సాగుకు రైతులు ఒక్కో ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఖర్చు అవుతుంది. దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడం మార్కెట్లో ధరలు అస్థిరంగా ఉండటంతో పెట్టుబడి కూడా రావడం లేదని నిరాశకు గురవుతున్న రైతులు కొంతమంది తోటలను నరికివేస్తున్నారు. వచ్చే ఏడాది లోగా మామిడి రైతుల సమస్యలపై అధ్యయనం చేసి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసు కోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరు తున్నారు. మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు, సబ్సిడీలు, సకాలంలో రుణాలు వంటి చర్యల ద్వారా ప్రభుత్వం మామిడి రైతులకు అండగా నిలబడాలి లేదంటే కోడూరు మామిడి పంటకు గడ్డుకాలం తప్పదు.

గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశలేదు...

గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి దిగుబడి బాగానే వచ్చింది. అయితే గిట్టు బాటు ధర మాత్రం రాలేదు. దళారులు, జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం సిండి కేట్‌గా మారి రైతులను మోసం చేస్తు న్నారు. ప్రభుత్వం హెచ్చరించినా వారు సహకరించడం లేదు. మార్కెట్‌లో ఒక వ్యాపారి నుంచి ఇంకో వ్యాపారి వద్దకు సరుకు తీసుకెళ్తే నిర్మొహమాటంగా వద్దంటున్నారు. కనీసం మామిడి తోట లపై పెట్టిన ఖర్చు రావడం లేదు. అందుకే మామిడి చెట్లను నరికేస్తున్నా నని ఓబులవారిపల్లి మండలం, వై.కోటకు చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



వై.కోట గ్రామంలో రైతు నరికేసిన మామిడి చెట్లు

ప్రతి ఏడాది తగ్గుతున్న విస్తీర్ణం

నియోజకవర్గంలో ప్రస్తుతం 22 వేల ఎకరాలో మాత్రమే మామిడి తోటలు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం సుమారు 27 వేల ఎకరాల్లో ఉన్న మామిడి తోటలు క్రమంగా తగ్గుతూ వచ్చి ఈ ఏడాదికి 22 వేల ఎకరాలకు పరిమితమయ్యాయి. గత ప్రభుత్వంలో కొంత భూమి నేషనల్ హైవేకు పోవడంతో ఎక్కువ శాతం మామిడి చెట్లను తొలగించారు. చీడ పీడలు, తెగుళ్ల సోకి, చెట్లు ఎండిపోతు న్నాయి. దీంతో దిగుబడి తగ్గిపోవడమే కాకుండా చెట్లు కూడా చనిపోతున్నాయి. ఈ సమస్య వలన రైతులు చెట్లను నరికేస్తున్నారు.

- భాస్కర్, ఉద్యానశాఖ అధికారి

హార్సిలీహిల్స్‌లో గాలిబండకు ముళ్ల కంచె



హార్సిలీహిల్స్‌లోని గాలిబండ వద్ద ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వద్ద సీఐ జీవన్ గంగనాథబాబు

బి.కొత్తకోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల ఆకర్షణ కోసం రూ.లక్షలతో సుందరీకరణ పనుల చేపట్టిన విషయం తెలిసిందే. వీటిని రెండు రోజుల కిందట కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రారంభించారు. పర్యాటకుల రక్షణ, కొండ మీద పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారు. రాత్రి పూట డీఎస్పీతో కలసి స్వయంగా హిల్స్ పైనున్న ప్రధాన కూడళ్లు సహా గాలిబండను పరిశీలించి మందుబాబులు గాలిబండ పైకి వచ్చి బహిరంగంగా మద్యం సేవించే విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రక్షణ పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆదేశాల్లో భాగంగా గాలిబండ ముఖద్వారంలో రాతి కూసాలు నాటించి ఫెన్సింగ్ వేయించారు. గురు వారం బి.కొత్తకోట సీఐ జీవన్ గంగనాథబాబు హార్సిలీహిల్స్‌లో ఫెన్సింగ్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై హార్సిలీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం వినియోగం, ఆకతాయి చేష్టల పై పోలీసుల నిఘా వుంటుందన్నారు. పర్యాటకులు తమ తోటి వారికి ఇబ్బంది కలగకుండా హిల్స్ పర్యటన ముగించుకుని వెళ్లాలన్నారు.

యువకుడి బొటనవేలు కొరికేసిన కానిస్టేబుల్

వీరబల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భూమి విష యంలో ఏర్పడిన తగాదా కారణంగా ఓ కానిస్టేబుల్ ఓ యువకుడిపై దాడి చేయడంతో పాటు అతని బొటన వేలిని కొరికి వేశాడు. మండ లంలోని ఈడిగపల్లికి చెందిన వెంకటేశ్వర్లు విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తు న్నాడు. శుక్రవారం తన కుమారుడు వినయ్‌తో కలసి వినోద్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన కారుపై దాడి చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వినోద్‌కుమార్ ఎడమ చేతి బొటన వేలిని వెంకటేశ్వర్లు కొరికివేశాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




వినోద్ బొటనవేలుకి గాయమైన దృశ్యం, కానిస్టేబుల్ వినోద్‌కుమార్

హాకీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన జట్లతో జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి ని పురస్కరించుకొని రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ (శాప్) శుక్ర వారం రాయచోటి పట్టణంలోని రాజు ఒలంపియాడ్ స్కూల్ సమీపం లోని హాకీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి పోటీలకు హాకీ క్రీడాకారు లను ఎంపిక చేసింది. ఎంపికైన జట్లు త్వరలో తిరుపతిలో జరగ నున్న జోనల్ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాయి. అన్నమయ్య జిల్లా హాకీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు, జిల్లా హాకీ ఫౌండర్ సీ. చంద్రశేఖర్, శాప్ కోచ్ చంద్రశేఖర్, రాజు స్కూల్ హాకీ కోచ్ నారాయణ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు.

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం

ములకలచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శుక్రవారం తెల్ల వారుజామున భారీ వర్షం కురిసింది. భారీ ఉరుములు, మెరుపు లతో కూడి వర్షం కురవడంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా ఉరుములు రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పెద్ద మండ్యంలో 57.8 మి.మీటర్లు, బి.కొత్తకోటలో 55 మి.మీటర్లు, ములకల చెరువులో 42 మి.మీటర్లు, పెద్దతిప్పసముద్రంలో 37 మి.మీటర్లు, తంబళ్లపల్లెలో 36.4 మి.మీటర్లు, కురబలకోటలో 10 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో ప్రధాన వీధులు వర్షపు నీరు పొంగి పొర్లాయి. మురికినీట కాల్వలు పొంగి వీధుల్లో ప్రవహించాయి. ములకలచెరువులో ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయి.

యూరియా కోసం రైతుల నిరీక్షణ




టమోటా చెట్లు పీకేసి వరి సాగుకు సిద్ధంగా ఉన్న పొలం, యూరియా కోసం దుకాణం ముందు వేచి ఉన్న రైతులు

● అరకొరగా యూరియా నిల్వలు

రామసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి పంటలకు యూరియా వాడకం ఎక్కువగా ఉండడంతో కాలిఫ్లవర్, కొత్తమీర, బీన్స్ తది తర పంటలకు యూరియా వాడకం అధికం కావడంతో యూరియా కొరత ఏర్పడింది. అయితే వ్యవసాయ అధికారులు, ఎరువులు విక్రయ డీలర్లు యూరియా అవసరాన్ని గుర్తించి నిల్వలు ఉంచుకోవడంలో అల సత్వం వహించడం వల్ల యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుందని తెలిసినా యూరియా నిల్వలు చేయకపో వడం అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడు తోందని రైతులు అంటున్నారు. రామస ముద్రం మండలంలో ప్రతి ఏడాది రబీ సీజ న్ కంటే ఖరీఫ్‌లో వరి సాగు ఎక్కువగా ఉంటుంది. అయితే మండలంలో వరి సాగు టమోటా ధరపై ఆధారపడి ఎక్కువశాతం చెరువులు, కుంటల కింద టమోటా సాగు చేస్తారు. కాగా ఈ ఏడాది జూన్ జూలై నెల లలో టమోటా రెట్లు ఆశాజనకంగా లేకపోవ డంతో టమోటా కాయలు అయిపోయాక చెట్లు పీకేసీ వరి సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది కంటే ఈ ఏడాది వరి సాగు పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఇందుకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలు, ఎరువుల డీలర్ల దుకాణా లలో యూరియా నిల్వలు అధికంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వరి నాట్లు వేసినప్పటి నుంచి వెన్ను వచ్చే దశ వరకు సుమారుగా రెండునెలలు పలుసార్లు వరికి యూరియా పిచికారీ చేయాల్సి ఉంటుందని ఇందుకు సరిపడా యూరియా నిల్వలు ఉండేలా వ్యవసాయాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే రైతుల అవసరాలను దృష్టిలో ఉంచు కుని కొందరు ఎరువుల విక్రయ డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోదండ రామాలయంలో వరలక్ష్మీ వ్రతం

ఒంటిమిట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాల యంలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చ కులు వీణా రాఘవాచార్యులు, శ్రావణకుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్‌లు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ రంగమంటపంలో ఆశీనులను చేశారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య వరలక్ష్మీవ్రతం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో వచ్చి వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు నవీన్‌కుమార్, భక్తులు పాల్గొ న్నారు.



వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దు టూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ (ఆదివారం) ఉచిత వైద్యశిబిరంనిర్వహిస్తున్నామని ఻ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రా రంభంలో ప్రజలు రోగాల బారీన పడకుండా ఆరోగ్యం గా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ వైద్యశిబిరం నిర్వహిస్తు న్నామన్నారు. ఈ వైద్యశిబిరం శంకరాపురం వీధిలోని మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామ ని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గుండె సంబంధిత, చి న్నపిల్లల, నరాలు, ఎముకలు సంబంధిత వ్యాధులతో పాటు బీపీ, షుగర్, థైరాయిడ్, ఊపిరితిత్తులు, మెద డు, వెన్నముఖ, విషజ్వరాలు సంబందించిన వైద్యులు పాల్గొని చికిత్సలు అందిస్తారని తెలిపారు. ప్రొద్దుటూ రు నియోజకవర్గ ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజలకు ఉ చిత మెగా వైద్యశిబిరం కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీ సీ సెక్రటరి యల్లయ్య, అబ్బాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరం కరపత్రాలను పంచుతున్న ఇర్ఫాన్‌బాషా

వైకల్య శాతం అనుసరించి ఉపకరణాలు



పీలేరులో శిబిరానికి హాజరైన ప్రత్యేక ప్రతిభావంతులతో అధికారులు

పీలేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైకల్య శాతం అను సరించి విభిన్న ప్రతిభావంతు లకు ప్రభుత్వం ఉచిత ఉప కరణాలు అందజేస్తుందని కడప, అన్నమయ్య జిల్లాల విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షే మశాఖ సహాయ సంచాల కుడు ఆర్‌వీ కృష్ణకిశోర్ పేర్కొన్నారు. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ఉపకరణాల లబ్ధిదారుల ఎంపిక శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు కడప జిల్లాలో 22 శిబిరాలు నిర్వహించి ఉపకరణాలు అందించేందుకు 4700 మంది లబ్ధిదారు లను ఎంపిక చేశామన్నారు. జిల్లాలో 21 శిబిరాలకు ఇప్పటి వరకు 18 శిబిరాలు నిర్వహించామని, మిగిలిన మూడు శిబిరాలు కూడా పూర్తయ్యాక లబ్ధిదారుల మొత్తం సంఖ్య తేలుతుందన్నారు. శిబిరానికి హాజరవుతున్న విభిన్న ప్రతిభావం తుల వద్ద ఉన్న సదరం ధృవపత్రాల్లోని వైకల్య శాతాన్ని లెక్కలోకి తీసుకుని ఉపకరణాలు అందజే స్తామన్నారు. 86 శాతానికిపైగా వైకల్యం ఉన్న వారికే మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు అందే అవకాశం ఉందన్నారు. ఉచిత ఉపకర ణాల కోసం ఎంపికైన ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.5 వేలు మొదలుకుని రూ.47 వేలు విలువైన ఉపకరణాలు ఉచితంగా అందజేస్తుందన్నారు. జిల్లా వికలాం గులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఉప సహాయ సంచాలకుడు శ్రీకాంత్, పీలేరు ఎంపీడీఓ శివశంకరయ్య, ఐఈడీఎస్ లలితకుమారి, ఐఈఆర్‌టీ ధరణీ జ, సీఆర్‌పీ మురళీధర్ రాజు, పీలేరు ఆదర్శ వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు పీవీ చలపతి, కార్యదర్శి కేవీ రమణ, సభ్యులు పాల్గొన్నారు.

కలకడ: అర్హులైన దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకో వాలని డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాటవారిపల్లె హైస్కూల్‌లో దివ్యాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. 76 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. అర్హులకు ప్రభుత్వం సరఫరా చేసే వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, వీల్ చైర్లు పంపిణీ చేస్తామని చెప్పారు.

ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి దేవస్థానానికి ధర్మకర్త మండలి నియామకం కోసం విజయవాడ దేవాదాయ శాఖ కమిషనర్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 26వ తేదీలోపు ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి కోసం ఆశావహులు అన్నమయ్య జిల్లా, రాయచోటిలోని జిల్లా దేవాదాయ శాఖ అధికారి కార్యాలయానికి చేరేలా దరఖాస్తు సమర్పించాలని కోరారు. లేటుగా చేరిన, చేర్చిన దరఖాస్తులు చెల్లవని మదనపల్లె గ్రూప్ టెంపుల్ ఈఓ రమణ ఓ ప్రకటనలో వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బస్సుకింద పడి చిన్నారి మృతి చెందిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక విజయవాణి పాఠశాల బస్సు డ్రైవరు నిర్లక్ష్యానికి నాలుగేళ్ల చిన్నారి దివాకర్ మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. పాఠశాల వ్యాన్‌కు క్లీనర్‌ను ఏర్పాటు చేయకపోవడమే ప్రధానం కారణంగా విద్యార్థి మృతి చెందడంతో బాధితుల ఫిర్యాదుపై పాఠశాల కరస్పాండెంట్ రఘుపతినాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు నాయుడు, డ్రైవర్ గురుప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దౌర్జన్యం చేసిన నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టివారి పల్లె బైపాస్ రోడ్డులో గురువారం పశువులు తరలిస్తున్న లారీని ఆపి, వారిపై దౌర్జన్యం చేసి పదివేలు డబ్బు డిమాండ్ చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె తాలుకా పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం, తిరువన్నామలై జిల్లా, అరణితాలుకా మయూరు వాసులు బాలాజీ, కమలకన్నన్ రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం అనంతపురం జిల్లా గోరంట్ల పశువుల సంత నుంచి రెండు ఎద్దులు, ఒక ఆవు, రెండు దూడలు తరలిస్తు న్నారు. వీరి వాహనం చైన్నై- ముంబై జాతీయ రహదారి తట్టివారి పల్లె వద్ద ఆర్టీఓ ఆఫీస్ వద్ద మదనపల్లె వాసులు చేగూరి నాగార్జున, సురేష్‌కుమార్ రైతుల వద్ద నుంచి పశువులకు సంబం ధించిన పేపర్స్ లొక్కుని, చంపుతామని బెదిరించి, పదివేలు రూపా యలు డిమాండ్ చేశారు. అనంతరం వారి అధీనంలోని వాహనాన్ని పట్టణంలోకి రాకుండా బైపాస్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో నిలిపి వాహనంలోని కమలకన్నన్ మొబైల్ ఫోన్స్ ద్వారా ఓనర్ మురళీ దాస్ మాట్లాడి పశువులను ఇక్కడే వదిలేసి వెళ్లాలని డిమాండ్ చేశారని తెలిపారు. వారు ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో తాలుకా సీఐ కళా వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

● టీడీపీలో చేరిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ



మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

ఒంటిమిట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ ఖాళీ అయ్యేలా కనపడుతోంది. ఇప్పటికే వైసీపీకి చెందిన ముఖ్య నేతలు రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రా జు ఆధ్వర్యంలో భారీగా చేరుతున్నారు. శుక్రవారం ఎంపీపీ లక్ష్మీ దేవి, వైస్ ఎంపీపీ బోగా గీతాదేవిలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చమర్తి జగన్‌మోహన్‌రాజుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే మండలంలోని మలకాటిపల్లె గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. మరో రెండు రోజుల్లో ఇంకొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలు స్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న పలు అభి వృద్ధి పనులను చూసి టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, న్యాయవాది రామదాసు, గజ్జల శ్రీనివాసరెడ్డి, బోగా శంకరయ్య, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

అండర్-22 జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

వాల్మీకిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-22 జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక వాల్మీకిపురంలో నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ సెలెక్టర్స్‌కు జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకా రులు పాల్గొనగా ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, సెక్రటరీ రవిచంద్ర, ఎస్ఐ చంద్ర శేఖర్, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, పీడీలు కిరణ్, రెడ్డివరప్రసాద్, సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడా కారులు, తదితరులు పాల్గొన్నారు.

అండర్-22 బాలికల జట్టు

కె.హిమశ్రీ, కౌశల్య(మదనపల్లె), గాయత్రి, హర్షిత, స్వాతి, మమేత, జి.గాయత్రి (తరిగొండ), భవ్యశ్రీ (గుర్రంకొండ), హర్షిత, రేణుక(సీటీఎం), హిమజ, వక్షశ్రీ, ఆరీఫా, వర్షిత, శాన్విత(వాల్మీకిపురం).

అండర్-22 బాలుర జట్టు

కార్తికేయ, రెడ్డిశేఖర్, క్రిష్ణకౌశిక్, అరవింద్, తరుణ్‌కుమార్, నియాజ్ (వాల్మీకిపురం), చైతన్య, దీపేష్, మౌనీష్, వెంకటసాయి, నిహార్ (మదనపల్లె), హేమనాథ్(తరిగొండ) జిల్లా జట్లకు ఎంపికయ్యారు.



అండర్-22 జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైన బాలబాలికలు

ప్రభుత్వ పాఠశాలల్లో... మెరుగైన విద్యా ప్రమాణాలు

● పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
● జిల్లా, మండలస్థాయిలో అకడమిక్ కమిటీల ఏర్పాటు



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి వివిధ పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా బోధన, వసతులు కల్పిస్తోంది. అయినా విద్యా ప్రమాణాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవని కేంద్రం నుంచి వచ్చిన రెండు సంస్థల సర్వేల్లో స్పష్టమైంది. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికి కూడికలు, తీసివేతలు కూడా రావడం లేదని, ఇంగ్లీష్ పదాలు చదవలేకపోతున్నారని నివేదికలు ఇచ్చాయి. ఈ నేప ధ్యంలో మరింత మైవిధ్యంగా విద్యాప్రమాణాలు మెరుగుపరిచేలా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నారు. ఆ దిశగా అకడమిక్ కమిటీలను నియమించి, పాఠశాలలను పర్యవేక్షించాలని నిర్ణయించారు. కమిటీలను సైతం నియమించారు. కమిటీల పనితీరు, విద్యాప్రమాణాలు పెంపునకు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్రస్థాయిలో సమీక్షించనున్నారు.

జిల్లాలో 3110 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో శాటిలైట్ పాఠశాలలు 121, ఫౌండేషన్ పాఠశాలలు 281, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 1840, మోడల్ ప్రైమరీ పాఠశాలలు 431, యూపీ పాఠశాలలు 37, ఉన్నత పాఠశాలలు 249, బేసిక్ ప్రైమరీతో కూడిన ఉన్నత పాఠశాలలు 102, మోడల్ స్కూల్‌తో కూడిన ఉన్నత పాఠశాలలు 49 ఉన్నాయి. వీటిలో విద్యాప్రమాణాల పెంపు, పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం జిల్లా, మండలస్థాయిలో అకడమిక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

కమిటీల పర్యవేక్షణ ఇలా...

జిల్లా స్థాయిలో డీఈఓ చైర్మన్‌గా, సమగ్రశిక్ష ఏపీసీ, ఏసీ, డీసీఈబీ కార్యదర్శి, ముగ్గురు ఎంఈఓలు సభ్యులుగా ఉంటారు. ప్రతి సబ్జెక్టుకు నలుగురు నిపుణులైన స్కూల్ అసిస్టెంట్ల చొప్పున 24 మంది టీచర్లను, ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5వ తరగతి వరకు పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీలో నలుగురు ఎస్‌జీటీ కేడర్‌లో నిపుణులైన టీచర్లకు అవకాశం కల్పించారు. మండల స్థాయిలోనూ నిరంతరం పర్యవేక్షణకు ఎంఈఓ-1, ఎంఈఓ-2, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ముగ్గురు ఎస్‌జీటీలకు కమిటీలో అవకాశం ఇచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు బృందాలుగా పాఠశాలలను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలు, ప్రమాణాల పెంపునకు ఎలా బోధిస్తున్నారు.. ఎన్‌రోల్‌మెంట్, విద్యార్థులు, టీచర్ల హాజరు, పాఠశాలలకు వచ్చిన నిధులు, వాటితో ఎలాంటి వసతులు కల్పించారు.. తదితర వివరాలను పరిశీలిస్తారు. తనిఖీ చేసిన పాఠశాలలోని పరిస్థితులను కమిటీ రాసుకోవాలి. అకడమిక్ కమిటీలతో రాష్ట్రస్థాయిలో మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ సమీక్ష నిర్వహిస్తారు. కమిటీల పనితీరు, గుర్తించిన సమస్యలపై ఆరా తీస్తారు. ఆ దిశగా ఇప్పటికే కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో అమలుకు అధికారులు కుస్తీ పడుతున్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకే...



విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు అకడమిక్ కమిటీ దోహ దపడు తుంది. సబ్జెక్టు నిపుణుల ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగు పడే అవకాశం ఉంటుంది. అలాగే ఉపాధ్యాయులు పిల్లలకు ఎలా బోధన చేస్తే సులువుగా నేర్చుకోగలరో అధ్యయనం చేసి.. విద్యార్థులకు బోధన చేసేందుకు ఉపయోగపడుతుంది. కమిటీ సమావేశాలు పాఠశాల సమయంలో కాకుండా పాఠశాల ముగిసిన తర్వాత (సాయంత్రం 4గంటల తర్వాత) నిర్వహించు కోవాలి. పాఠశాల సెలవు దినాలలో నిర్వహించాలి. ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని ఆ దిశగా అకడమిక్ కమిటీలు పనిచేయాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. త్వరలో మండల స్థాయి సమావేశాలు కూడా నిర్వహించి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తారు.

- షంషుద్దీన్, డీఈఓ

గండిక్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి



పాపాఘ్ని నదిలో కాల్వ పూడిక తీయిస్తున్న దృశ్యం

చక్రాయపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధి గాంచిన గండి క్షేత్రంలో అత్యంత వైభవంగా జరిగే శ్రావణమాసం మూడో శనివారం జరిగే మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. లక్షలాది మంది భక్తులు రానుండడంతో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఉత్సవ కమిటీ మెంబర్ వెంకటస్వామి, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రానికే గండికి భారీగా భక్తులు చేరుకున్నారు. అలాగే దేవస్థానంపూలతో ముంచెత్తారు. అందుకు రకరకాల పూలు చెన్నై నుంచి తెప్పించారు. రెడ్ ఆస్ట్రేలియా, చామంతి, పచ్చచామంతి, బంతి పూలు, లిల్లీపూలు తదితర రక రకాల పూలను కూడా తెప్పించి డెకరేషన్ చేస్తున్నారు. క్యూలైన్లు తాగునీటితో పాటు భక్తుల స్నానాల కోసం కాల్వల పూడిక తీయించడం చేస్తున్నారు. వచ్చే భక్తుల కోసం దాదాపు 30000 లడ్లు ప్రసాదాలు, 30వేల పులిహోర ప్యాకెట్లు కూడా ఏర్పాటుచేశారు.

సీఐ ఉలసయ్య, ఎస్ఐ రంగారావులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చలువ పందిళ్లు లాంటివి కూడా వేశారు. ప్రధాన అర్చకుడు కేసరి,ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ గర్భాలయాన్ని పూల డెకరేషన్లు చేయించారు. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నారు. కొర్లపాడుఅంకిరెడ్డి, బిస్మిల్లాబాదుతో పాటు గోవిందమాల ఆంజనేయులు వారి ఆధ్వర్యంలో ఐదు కౌంటర్లు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వారితో పాటు దేవస్థానం కూడా భారీ ఎత్తులో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడానికి అన్ని ఏర్పాట్లుచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి



ప్రమాదస్థలి వద్ద తీవ్రగాయాలతో శ్రీనివాసరెడ్డి

వల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రోడ్డులో తోళ్లగంగనపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డి.శ్రీనివాసులరెడ్డి (46) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ పెద్ద ఓబన్న వివరాల మేరకు... వల్లూరు మండలం గంగాయపల్లెకు చెందిన శ్రీనివాసుల రెడ్డి కడప కోర్టులో న్యాయవాదిగా పని చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై కడపకు వెళుతుండగా సత్యా గ్రీన్‌సిటీ వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వైపు ఢీకొన్నాడు. దీంతో శ్రీనివాసులరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించగా.. చికిత్స చేస్తుండగా సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. శ్రీనివాసులరెడ్డికి భార్య వసంత, ఆరు నెలల పాప ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని గొర్రెలు మృతి



రోడ్డు పక్క మృతి చెందిన గొర్రెలు

ముద్దనూరు ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తాడిపత్రి రోడ్డులోని ఈద్గా సమీపంలో శుక్రవారం ఉదయం లారీ ఢీకొనడంతో 6 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. ముద్దనూరు వైపు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న లారీ ఈద్గా వద్ద రోడ్డు దాటుతున్న గొర్రెల మందపై దూసుకెళ్లింది. దీంతో జాఫర్ అనే వ్యక్తికి చెందిన 6 గొర్రెలు మృతి చెందాయి.

స్టాప్ బోర్డును ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన మునీంద్ర

కమలాపురం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మూడు రోడ్ల కూడలిలో స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేసిన స్టాప్ బోర్డును ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మునీంద్ర తన సొంత పనులు ముగించుకొని మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మూడు రోడ్ల కూడలిలో ప్రమాదవశాత్తు స్టాప్ బోర్డును ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ప్రాంతంలో రహదారి గోతులతో ప్రమాదకరంగా ఉందని.. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

● తప్పిన ప్రమాదం ● సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు



పొలాల్లోకి దూసుకుపోయిన కారు

కాశినాయన, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం పిడుగుపల్లె గ్రామాల మధ్య పోరుమామిళ్ల నుంచి గిద్దలూరు వెళ్లే ప్రధాన రహదారికి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. దీంతో స్తంభం విరిగి పడింది. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఉంది. అయితే కారు అలాగే పొలాల్లోకి దూసుకుపోవడంతో ప్రమాదం తప్పింది. కారు ముందు భాగం దెబ్బతింది. అదృష్టవశాత్తు కారులో ఉన్నవారు ఎలాంటి గాయాల బారిన పడకుండా సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. సమీప గ్రామమైన చెన్నారెడ్డిపల్లెలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతున్న క్రమంలో ఈసంఘటన చోటుచేసు కున్నట్లు సమాచారం.

ప్రైవేటు ఆస్పత్రులపై ఆకస్మిక తనిఖీలు

● నిబంధనలకు లోబడి సేవలు అందించాలి ● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత



ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారుల బృందం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో వైద్యాధికారులు మూడు బృందాలుగా విడిపోయి ప్రతి బృందం సుమారు 30 ఆస్పత్రులను తనిఖీ చేసేలా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు బృందం ఆస్పత్రులపై సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా డాక్టర్ల విద్యార్హత, రిజిస్ట్రేషన్, బయోమెడికల్ వేస్టేజీ నిర్వహణ, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, నోఅబ్జక్షన్ సర్టిఫికెట్, లైసెన్సులు, చికిత్స రేట్లు వంటి అంశాలపై అధికారులు పరిశీలించారు. కొన్ని ఆస్పత్రుల్లో రేట్ల ప్రదర్శన లోపం ఉన్నట్లు గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్పష్టమైన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రులలో స్టెబిలైజేషన్ పద్ధతులు, నర్సింగ్ సిబ్బంది అర్హత, రెఫరల్ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఐవీఎఫ్, ఐవీఐ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. పట్టణంలో అక్షయ ఆస్పత్రి, గాయత్రీ ఐవీఎఫ్ వంటి సెంటర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్నాయన్నారు. విశ్వల్యాపరోస్కోపీ, ఐవీఎఫ్ సెంటర్‌పై తనిఖీ నిర్వహించగా ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయి పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చేవరకు ఆస్పత్రులలో ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయకూడదని, వైద్యసేవలు అం దించరాదని హెచ్చరించారు. ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యానికి మాత్రమే పరిమితం కావాలని, ల్యాబ్‌లు, ఫార్మసీ వంటి సౌకర్యాలను సమకూర్చుకోరాదన్నారు. నాలుగు రోజుల్లో అన్ని ఆస్పత్రులకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసి ఆరోగ్యశాఖ డాక్టరేట్‌కు వివరాలను పంపుతున్నట్లు వివరించారు.

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

కలసపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గురువారం చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో పలువురిని విచారించారు. ఫోరెన్సిక్ సైంటిఫిక్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆధారాలను సేకరించారు. కాగా, పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించినట్లు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నిందితుడికి కఠినశిక్షపడేలా అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బద్వేల్ సీఐ నాగభూషణం, కలసపాడు ఎస్ఐ తిమోతి, పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

కొండాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శివప్రసాద్‌రెడ్డికి రోడు ప్రమాదంలో గాయాలయ్యాయి. గండిలో శ్రావణశనివారం సందర్భంగా డ్యూటీ నిమిత్తం శుక్రవారం కొండాపురం నుంచి బైకులో వెళుతుండగా పులివెందుల సమీపంలోని రాయలపురం వద్ద బైక్‌ను ఆటో ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో బైక్ కిందపడటంతో అతనికి చేయి విరిగింది. చికిత్స నిమిత్తం పులివెందుల ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పెన్నాపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మైలవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి శనివారం 10 వేల క్యూసెక్కుల నీటిని సోమశిల జలశయానికి పెన్నానది ద్వారా విడుదల చేశామని.. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలవరం జలాశయ అధికారులు శుక్రవారం తెలిపారు. పెన్నా పరివాహక ప్రాంతాలు అయిన వేపరాల, దొమ్మరనంద్యాల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పట్టణ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రజకులు, రైతులు, స్కూలుకు వెళ్లే విద్యార్థులు, మత్స్యకారులు నదికపరివాహక ప్రాంతంలో వెళ్లడం నిషేధించారన్నారు. నదిలోకి వెళ్లకుండా పిల్లలపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం సుబ్బిరెడ్డి ఇంటివద్ద రోడ్డు నిర్మాణం విషయమై జరిగిన ఘర్షణ నేపథ్యంలో మనస్థాపం చెంది విషద్రావణం తాగాడు. కాగా, సుబ్బిరెడ్డి కుమార్తె లక్ష్మీదేవి తన తండ్రి మృతిపై కొందరిపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పూర్తి కోణంలో విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డిపేట సమీపంలో శుక్రవారం పొలాల్లో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.4,600 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చినుకు పడితే చెరువే..

● కడప రోడ్డులో, ఎన్‌హెచ్ రోడ్డులో భారీగా నిలుస్తున్న వర్షపునీరు ● శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల వినతి



ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు కాంప్లెక్స్ వద్ద నిలిచిన వర్షపు నీరు

ఎర్రగుంట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎర్రగుంట్లలో ప్రధాన రోడ్లలో, వీధుల్లో డ్రైనేజీలు లేక నరకం అనుభవిస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి వేసిన నేషనల్ హైవేల్లో సైతం నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపైనే నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండేళ్ల క్రితం ఎర్రగుంట్లలో వేసిన జాతీయ రహదారిలో కడపరోడ్డులో ఇరువైపులా డ్రైనేజీ నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాడు అధికారులు చేసిన తప్పిదాలకు పాలకులు కూడా వంత పాడటంతో ఈ పరిస్థితి దాపరించిందని ప్రజలు వాపోతున్నారు. ఎన్‌హెచ్‌కు ఇరువైపులా డ్రైనేజీకి ప్రతిపాదనలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అలాగే స్థానిక నిధులు భారీగా కేటాయించి టెండర్లు పూర్తయినా పనులు చేయించుకోలేని దుస్థితి ఏర్పడింది. దీంతో మంజూరైన పనులు కూడా ఆగిపోయి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

● తీవ్ర ఇబ్బందులు

కడప రోడ్డులోని మార్కెట్‌యార్డు కాంప్లెక్స్ వద్ద, పాత జేకే వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోతున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే భారీగా నీరు ఆగడంతో వాహనచోదకులకు, దుకాణదారులకు ఇబ్బందిగా మారింది. వర్షపునీరు నిలవడం వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు వ్యాపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

గండికోట నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల



మైలవరానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి రెండు గేట్ల ద్వారా మైలవరం జలాశయానికి శుక్రవారం సాయింత్రం 5వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేసేందుకు ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో శుక్రవారం 15,800 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం గండికోట నుంచి సీబీఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 15.63 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

అవినీతి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

అఖిలపక్ష సమావేశంలో నేతల డిమాండ్

కడప సెవెన్‌రోడ్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థలో చెత్త పన్నుపై అవినీతికి పాల్పడిన వారి నుంచి దుర్వినియోగం చేసిన సొమ్ము రికవరీ చేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్, ఇతర పార్టీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చెత్త పన్ను అవినీతి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం జరిగింది. నగరపాలక సంస్థలో పాలకవర్గం కుర్చీల కోసం కొట్లాడుతుంటే అధికార యంత్రాంగం నగరంలో వసూలు చేసిన పన్నులన్నీ ఇష్టానుసారంగా దుర్వినియోగం చేశారని వారు విమర్శించారు. చెత్త పన్ను అవినీతి 2020 సంవత్సరం నుంచి జరుగుతోందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం అవినీతి మీద ఒక నిజాయితీ కలిగిన ఐఏఎస్ అధికారిచేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు మాత్రమే కాకుండా కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ,కాంగ్రెస్ పార్టీ నేతలు సత్తార్, అలీఖాన్,సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు డబ్ల్యూ.రాము తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

వేడుకగా వరలక్ష్మీ వ్రతం

ఆలయాల్లోనూ నిర్వహించిన వేడుక ● మహిళలతో కిటకిటలాడిన ఆలయాలు ● ఇంటింటా ప్రత్యేక పూజలు
పీటీఎంలో సత్యన్నారాయణ వ్రతం ● మహిళలకు పసుపు, కుంకుమ, పూలు, గాజులు పంపిణీ



పాలతల ఆలయంలో, ఓఇంట్లో వరలక్ష్మీ వ్రతం వేడుకలు - మదనపల్లెలో వ్రతంలో పాల్గొన్న మిట్స్ యూనివర్సిటీ ప్రతినిధులు - పీటీఎం శివాలయంలో సత్యన్నారాయణ వ్రతం

హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం శుభాలను తెచ్చిపెడుతుందని నమ్మకం. అందుకే శ్రావణ మాసాన్ని శుభాల మాసమని, మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైనదిగా గుర్తింపు. పౌర్ణమికి ముందు శుక్రవారం లక్ష్మీదేవి జన్మదినంగా భావిస్తూ మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. సౌభాగ్యాన్నిచ్చే వరలక్ష్మీ వ్రతం ఆలయాల్లోనూ చేశారు. వివరాల్లోకెళితే...

మదనపల్లె అర్బన్/టౌన్, ఆగస్టు 8: పట్టణంలో వరలక్ష్మీవ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మను ప్రత్యేకంగా గాజులతో అలంకరించారు. ధూపదీపనైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మహిళలకు తీర్థప్రసాదాలు, గాజులు అందజేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు జోలపాలెం కరుణాకర్‌నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని కమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, ట్రెజరర్ రామిశెట్టి రత్నమయ్య, కమిటీ సభ్యులు పదిలక్షల రూపాయలు నోట్లతో అమ్మవారిని ధనలక్ష్మీగా అలంకరించారు. మహిళలకు తీర్థప్రసాదాలు, గాజుల, పసుపు కుంకుమలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రెడ్డెప్పనాయుడు కాలనీలో మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ యాజమాన్యం విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారిని కొలువుదీర్చి వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. పూజ అనంతరం మహిళలకు గాజులు, పసుపు కుంకుమలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మిట్స్ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారకనాధరెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదేళ్ల విద్యాసాగర్, డాక్టర్ లయన్స్ భాస్కర్‌నాయుడు, మిట్స్ ప్రిన్సిపాల్ యువరాజ్, రాటకొండ గుర్రప్పనాయుడు, దుబ్బిగాళ్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో....

కురబలకోట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఘనంగా వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఇళ్లల్లో లక్ష్మిదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రతి ఒక్కరికీ ఆయుఆరోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరుతూ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తంబళ్లపల్లెలో....

తంబళ్లపల్లె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లలో లక్ష్మీదేవి ప్రతిమను కొలువుదీర్చి పసుపు, కుంకుమ, పూలు, చీర, గాజులు, డబ్బుతో అమ్మవారిని సుందరంగా అలంకరించి సహస్ర పారాయణం, లక్ష్మీ అష్టోత్తర నామాలు చదివి పూజలు చేశారు. పురాతన కోదండ రామాలయంలో స్థానిక మహిళలు, భక్తులతో కలిసి ఆలయ ధర్మకర్త వంశీయులు టీఎన్ హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీలత రెడ్డి దంపతులు వరలక్ష్మీ వ్రతం ఆచరించి ప్రత్యేక హోమాలు నిర్వహించారు.



తంబళ్లపల్లె కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న హోమం

ములకలచెరువులో...

ములకలచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ప్రతి ఇంట్లో మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అమ్మవారి వ్రతం ఆచరించారు. ములకలచెరువు, బురకాయలకోట, సోంపల్లె, మద్దినాయనిపల్లె, నాయనిచెరువుపల్లె. కదిరినాధునికోట తదితర గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.



వేడుకగా సత్యన్నారాయణ వ్రతం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి అభిషేకపూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి బారులు తీరి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయంలో కర్ణాటక రాష్ట్ర వేదపండితులు మణికంఠశర్మ, మంజునాథశర్మచే సత్యనారాయణస్వామి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని అలంకరించి సత్యన్నారాయణ వ్రతం నిర్వహించారు. శ్రావణమాసం, వరలక్ష్మీ వ్రతం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సత్యన్నారాయణ వ్రతాన్ని తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కమిటీ సభ్యులు అన్నదానం చేపట్టారు.

పీలేరులో....

పీలేరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల తెలుగింటి ఆడపడుచులు వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. తెలుగు సంప్రదాయంలో అత్యంత ప్రాశస్త్యం కలిగిన ఈ పండుగ సందర్భంగా మహిళలు శుక్రవారం ఉదయాన్నే మంగళస్నానాలు చేసి కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లారు. కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, రౌద్రాల అంకాళమ్మ ఆలయం, ప్రకాశం రోడ్డు, సదుం రోడ్లలోని రామాలయాలు, అగ్రహారంలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, మదనపల్లె రోడ్డులోని చెన్నకేశవ స్వామి ఆలయం, కోటపల్లెలోని ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం, వేంకటాద్రి ఆలయం, ఇండ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, పూజారులు మహిళల చేత వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరింపజేశారు.



పీలేరులో పుట్టకు పూజలు చేస్తున్న దృశ్యం

పలువురు మహిళలు పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మండలంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కొందరు ఇళ్లల్లోనూ లక్ష్మీదేవిని కొలువుదీర్చుకుని వ్రతం ఆచరించారు. ముత్తయిదువులకు వాయినాలు అందించారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

వాల్మీకిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతం వైభవంగా చేసుకున్నారు. ఇంటింటా అమ్మవారి ప్రతిమలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో వ్రతం నిర్వహించారు. పొలతల కొండ వద్ద వెలసిన అక్కదేవతల ఆలయం, ధర్మపథం ఆలయం, కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం సహా పలు దేవాలయాల్లో వ్రతం చేసుకున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

కలకడలో....

కలకడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం అమ్మవారి జన్మదినంగా చేసుకునే వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. కలకడ సిద్దేశ్వర ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రకోటపల్లె, కలకడ సిద్దేశ్వర స్వామి ఆలయంలో భక్తులు నాగు రాళ్లకు పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. పిండి వంటలను ప్రసాదాలుగా ఉంచారు.

మూన్నాళ్ల ముచ్చటే...?!

● డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత డొల్ల
● కంకర తేలిన రివిట్‌మెంట్

గుర్రంకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):ప్రజల సౌకర్యార్థం నిర్మించిన మురికి కాల్వల నిర్మాణంలో నాణ్యత లోపించింది. దీంతో మురికి నీరు ఆ కాల్వల్లో నామ మాత్రంగానే వెళుతోంది. ఈ కొద్దిపాటి మురికి నీరు ప్రవహించినందుకే కాల్వలు దెబ్బతినట్లు అధికారులు చెబుతున్నారు. మురికి కాల్వ నిర్మాణంలో నాణ్యత పాటించినా మురికి నీటిలో యాసిడ్ గుణాలు ఉండడంతో కాల్వ రివిట్‌మెంట్ దెబ్బతింటాయని ఇంజనీరింగ్ అధికారులు చెప్పడం విశేషం. అంతేకానీ మురికి కాల్వ నిర్మాణంలో నాణ్యతను పాటించలేదని మాత్రం అంగీకరించలేదు.

గుర్రంకొండ పట్టణంలోని క్యూబావీధిలో మురికి కాల్వలను నేతలు నిర్మించారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ, మండల నిధులతో క్యూబావీధిలో మురికి కాల్వను నిర్మించారు. దీని నిర్మాణానికి పంచాయతీ నిధులు రూ.3లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు ఖర్చు చేసి మురికి నీటి కాల్వను వైసీపీ నేతలు నిర్మించారు. అప్పట్లో కాల్వ నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించలేదు. అంతేకాకుండా కాల్వ పనులను పరిశీలించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అటువైపు చూడకపోవడంతో మురికి కాల్వ పనులను నాణ్యత లేకుండా కట్టేశారు. మురికి కాలువ నిర్మాణం పూర్తికాగానే సంబంధిత అధికారులు ఎం.బుక్‌లను రికార్డు చేసి బిల్లులను మంజూరు చేశారు. దీంతో నేతలు బిల్లులను డ్రా చేసుకుని జేబులో వేసుకున్నారు. ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకే మురికి కాల్వకు ఇరువైపులా నిర్మించిన కాంక్రీట్ రివిట్‌మెంట్ దెబ్బతిన్నాయి. నాణ్యత లేకపోవడంతోనే వర్షాలకే దెబ్బతిని కంకర తేలాయి. వర్షాలు పెద్ద సంఖ్యలో కురిస్తే ఆ దాటికే మురికి కాల్వలు కొట్టుకుపోయే ప్రమాదముందని వీధి ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి నాసిరకంగా నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామి వివరణ కోరగా మురికి కాల్వ నిర్మాణంలో నాణ్యత పాటించినట్లు తెలిపారు. అప్పట్లో సచివాలయంలో పని చేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనులను పర్యవేక్షించారని చెప్పారు. మురికి కాల్వ నిర్మాణాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కంకర తేలిన మురికి కాల్వ రివిట్‌మెంట్

విద్యుత్ కార్మికుల అరెస్ట్ సరికాదు

రాజంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ నిర్వహిస్తున్న విద్యుత్ కార్మికులను పోలీసులు అడ్డుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యలను కూటమి నేతలు ఎన్నికల సమయంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్ చేస్తామని చెప్పారు. కానీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వ అధికారులకు, విద్యుత్ యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించడం లేదన్నారు. విద్యుత్ సంస్థలో పోస్టులు భర్తీ చేయకుండా ఉన్న కార్మికులపైనే పనిభారం మోపుతున్నారన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా గొంతునొక్కడం సరికాదని, వెంటనే పరిష్కారం చూపాలన్నారు.

రేపటి నుంచి జిల్లా మహాసభలు

రాయచోటి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సమస్యలపై 10, 11 తేదీల్లో మదనపల్లిలో నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా 2వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ శుక్రవారం పిలుపునిచ్చారు. జిల్లాలో పరిశ్రమలు చేసి వలసలు నివారించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మించాలని, హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా సాగు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.

పిడుగుపాటుతో గ్రామంలో అంధకారం

నిమ్మనపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అగ్రహారం పంచాయతీ బండమీదహరిజనవాడలో గురువారం పిడుగు పడడంతో గ్రామంలో అంధకారం నెలకొంది. బండమీద హరిజనవాడలో వెంకటరమణ ఇంటిపై పిడిగు పడిన విషయం తెలిసిందే. అయితే పిడుగు పాటుకు గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కావడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. శుక్రవారం విద్యుత్ అధికారులు గ్రామంలో పర్యటించి కాలిపోయిన ఇళ్లకు ఏర్పాటు చేసిన దాదాపు 20 మీటర్లను తీసుకెళ్లారు. గ్రామంలో ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి. శుక్రవారం కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాక పోవడంతో గ్రామస్తులు చీకట్లోనే వుండిపోయారు.

రేపటి శోభాయాత్రకు తరలిరండి

వాల్మీకిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదివారం రాయచోటిలో నిర్వహించనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. కార్యకర్తల సభకు మండలం నుంచి బీజేపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని మండల అధ్యక్ష కార్యదర్శులు జాకీర్‌హుస్సేన్, విష్ణుచైతన్య పేర్కొన్నారు. కార్యక్రమానికి ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని అధిక సంఖ్యలో వచ్చి శోభాయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక పట్టాభిరామాలయం వద్ద నుంచి కార్యకర్తల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేద్దాం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్ పిలుపు నిచ్చారు. స్థానిక సొసైటీ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారథ్యం పేరుతో సంక్షేమం క్షేత్ర స్థాయి వరకు చేర్చేలా రాష్ట్రవ్యాప్తంగా పర్యటన రాష్ట్రఅధ్యక్షుడు చేపట్టాలన్నారు. ఇప్పటికే కర్నూల్, కడప, నందలూరు, అనంతపురం జిల్లాల్లో పూర్తి చేసి రాయలసీమ జిల్లాల్లో 10న సారథ్యం పేరుతో సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి నేత, కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి పులి నరేంద్రకుమారెడ్డి, మదనపల్లె అసెంబ్లీ కన్వీనర్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ వర్ణ అలంకరణలో మారెమ్మ దేవత



మదనపల్లె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దిగువ కమ్మపల్లెలో వెలసిన మారెమ్మదేవత స్వర్ణ వర్ణ అలంకరణలో భక్తులకు అభయం ఇచ్చారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం సందర్భంగా అమ్మవారికి స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఇటీవల కొత్తగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించి పునరుద్దరణ చేపట్టారు. అమ్మవారికి బంగారు వర్ణ కవచాన్ని అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మదనపల్లె టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సీటీఎం వద్ద సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఎస్పీడీసీఎల్ ఏఈ రమేశ్ పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సీటీఎం, పోతబోలు, కొత్తవారిపల్లె పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

పీలేరు పట్టణంలో....

పీలేరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో శనివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ ఏఈ ఇలాహీ తెలిపారు. వినియోగ దారులు, పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. సబ్ స్టేషన్ మర్మతులు చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

రామసముద్రం మండలంలో...

రామసముద్రం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మస్తాన్‌వలి తెలిపారు. మదనపల్లె-రామసముద్రం 130కేవీ విద్యుత్‌లైన్‌కకు మరమ్మత్తులు చేస్తుండడంతో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

సమస్యలున్నాయనే అనుమతి నిరాకరణ

పీలేరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో సమస్యలు నెలకొన్నాయని, అవి బయటి ప్రపంచానికి తెలియకూడదనే విద్యార్థి సంఘాలను పాఠశాలల్లోకి అనుమతించకుండా ప్రభుత్వం జీఓ జారీ చేసిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారాయణ పాఠశాలలో ఆడబిడ్డలకు భద్రత కరవైందని ఆరోపించారు. పలు మార్లు హెచ్చరించినా ఉపాధ్యాయుల ప్రవర్తనలో మార్పు రావడంలేదని విమర్శించారు. యాజమాన్యం ఆడబిడ్డలకు కనీస భద్రత కల్పించడంలో విఫలమైందన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న విషయాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలో ఉత్పన్నమయ్యే విషయాలు తల్లిదండ్రులకు చెప్పుకోలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న దందాలు, విద్యార్థుల ఇబ్బందులపై విద్యార్థి సంఘాలు పోరాడతాయన్నారు.

మల్లన్నకు వెండి చెంబు, త్రిశూలం బహూకరణ

తంబళ్లపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ మల్లన్నకు వెండి అభిషేకపు చెంబు, అమ్మవారికి ఇత్తడి త్రిశూలాన్ని దాతలు బహూకరించారు. రంగసముద్రం వాసులు శ్రీనివాసచారి, నాగరత్నమ్మ దంపతులు కుటుంబసభ్యులతో కలిసి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం 149 గ్రాముల బరువు గల రూ.15,855లు విలువైన వెండి అభిషేకపు చెంబు, రూ.1500 విలువైన ఇత్తడి త్రిశూలాన్ని పూజారికి అందచేశారు. అర్చకులు ఈశ్వరప్ప, మల్లి కార్జున దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి వారి పేరిట అర్చన, అభిషేకం నిర్వహిం చి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈఓ మునిరాజ, సిబ్బంది కొండ కిట్టు, భక్తులు దాతల దాతృత్వాన్ని అభినందించారు.



వెండి చెంబు, ఇత్తడి త్రిశూలాన్ని అందచేస్తున్న దాతలు

'నాడు నేడు' ఇదే దుస్థితి


అసౌకర్యాలతో విద్యార్థుల పోరాటం ● క్రీడా మైదానమూ కరువే.. ● పూర్తి కాని భవన నిర్మాణాలు

వాల్మీకిపురం, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ప్రహసనంలా సాగిన నాడు-నేడు పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. విద్యార్థులు అసౌకర్యాలతో నిత్యం పోరాడుతూనే ఉన్నారు. పాఠశాలకు కనీసం మైదానం కూడా కరవైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ఏళ్ల గడిచినా లక్ష్యం సాధించలేక పోయింది. మొదటి దశలో మండలంలో 14 పాఠశాలలు, రెండో దఫా 27 పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు మంజూరైనా పనుల్లో లక్ష్యం సాధించలేకుంది. వివరాల్లోకెళితే....

మండల వ్యాప్తంగా నాడు-నేడు పనుల ద్వారా 14ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి రూ.5.14 కోట్లు నిధులు పూర్తిగా మంజూరై పనులు కూడా మొదలెట్టారు. రెండో విడతలో 27 పాఠశాలలకు రూ.9.88కోట్ల అంచనాతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. అందులో రూ.3.20కోట్ల నిధులు విడుదలవగా రూ.2.89కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. కోట్ల రూపాయలు వెచ్చించి పాఠశాలల్లో సౌకర్యాలు, వసతుల కల్పనపై నిర్లక్ష్యంగా వ్యవహరించారనే వాదనలూ వినిపిస్తున్నాయి. పట్టణంలోని పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.56.12లక్షల తోనూ, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో రూ.13.56లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఏళ్లు గడిచిపోతున్నా భవన నిర్మాణాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తి అయినట్లు కనిపిస్తున్నా సౌకర్యాల కల్పన పూర్తిస్థాయిలో చేపట్టక పోవడంతో అసౌకర్యాల నడుమ, తగరతి గదుల నిర్వహణ కొనసాగుతుండడం గమనార్హం. పీవీసీ ఉన్నత పాఠశాలలో భవనాలు నిర్మాణం పూర్తి కాక అందులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గదుల ఎదుట గ్రానైట్ బండలను వాల్చి పెట్టారు. పాఠశాల ప్రాంగణలో ఉన్న మైదానం కూడా భవన నిర్మాణాలు, మొక్కల పెంపకంతో పూర్తిగా కనుమరుగైంది. దీంతో విరామ సమయం, క్రీడా సమయం కూడా విద్యార్థులు కోల్పోతున్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయి మొండి గోడలను తలపిస్తున్నాయి. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం జరగకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతుండడం గమనార్హం. ఇప్పటికైనా మండల వ్యాప్తంగా రెండో విడత నాడు-నేడు పనులు పూర్తి చేసి వసతుల కల్పన మెరుగ్గా ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఎంఈఓ వెంకటరత్నం వివరణ ఇస్తూ మండలంలోని పాఠశాలల్లో నాడు-నేడు పనుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.



జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పిల్లర్లకే పరిమితమైన అదనపు గదుల నిర్మాణం



అసంపూర్తి నిర్మాణాలతో భవనాలు - భవన నిర్మాణాలు, చెట్లతో కనుమరుగైన మైదానం

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

బి.కొత్తకోట, పెద్దమండ్యం ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట, పెద్దమండ్యం మండలాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. పలు దేవాలయాలు, నివాస గృహాల్లో అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి పూలు, పండ్లతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఇరుగు పొరుగు వారిని ఆహ్వానించి వరలక్ష్మీవ్రతం నిర్వహించారు.



ఇంట్లో కొలువుదీరిన అమ్మవారు